RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/


ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:77 23-10-2025 గురువారం ఎడిటర్ :మట్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /

## మంత్రాలయంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్



మంత్రాలయం : అక్టోబర్ 22 ,(టుడే విదుర): ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కర్నాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీ మఠం మేనేజర్ ఎస్కె శ్రీనివాసరావు అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి సహాయక పిఆర్వో హెబ్బాళ్ళి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని, హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వారికి జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు.

## ఉక్కుపాదంతో అణచివేస్తాం.. తుని ఘటనపై మంత్రి లోకేష్



అమరావతి, అక్టోబర్ 22 ,(టుడే విదుర): కాకినాడ జిల్లా తునిలోని గురుకుల పాఠశాలలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం ఘటనపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. తుని రూరల్ గురుకుల పాఠశాల విద్యార్థినిపై తాటిక నారాయణరావు అనే కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడినట్లు తెలుసుకొని షాక్కు గురయ్యానని అన్నారు. సంఘటన వివరాలు తెలిసిన వెంటనే పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వాడెవరైనా ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు.బాధితురాలు ధైర్యంగా ఉండేలా కౌన్సిలింగ్ ఇచ్చి, అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థినిలకు పటిష్టమైన భద్రత కల్పించాల్సిందిగా అధికార యంత్రాంగానికి మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారు.కాగా.. తుని గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై నారాయణ అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించడం తీవ్ర కలకలం రేపింది. స్కూల్ నుంచి బాలికకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిన కామాంధుడు.. ఓ నిర్మానుష్య ప్రాంతంలో మైనర్పై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి నిలదీయగా నిందితుడు పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు నారాయణను అదుపులోకి తీసుకున్నారు.


## అయ్యప్ప సేవలో ద్రౌపది ముర్ము..

### శబరిమలను దర్శించుకున్న తొలి రాష్ట్రపతి



(టుడే విదుర): కేరళ పర్యటనలో ఉన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలకు చేరుకున్నారు. ఇరుముడితో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆరు కాన్వాయ్లతో ద్రౌపది ముర్ము శబరిమలకు చేరుకున్నారు. రాష్ట్రపతి కోసం నిబంధనలు సడలించిన అధికారులు వాహనాల్లో శబరిమల చేరుకునేలా ఏర్పాట్లు చేశారు అంతకుముందు శబరిమలకు వెళ్తున్న క్రమంలో రాష్ట్రపతి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు . అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఆమె హెలికాప్టర్లో ప్రయాణించారు. ప్రమదం ప్రాంతంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో హెలికాప్టర్ ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా హెలిప్యాడ్ కుంగిపోయింది. హెలికాప్టర్ చక్రం హెలిప్యాడ్ కాంక్రీట్లో కూరుకుపోయింది. అధికారులు వెంటనే స్పందించి సమస్యను సరిచేశారు.

## ఎపి వర్సిటీలతో కలిసి పనిచేయండి : ఆస్ట్రేలియా పర్యటనలో లోకేష్ పిలుపు



అమరావతి : అక్టోబర్ 22 ,(టుడే విదుర): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన కొనసాగుతోంది. రెండో రోజు (బుధవారం) పర్యటనలో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ నార్త్ సౌత్ వేల్స్ ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అధునాతన బోధనా పద్ధతులపై సీనియర్ ఎగ్జిక్యూటివ్స్, పరిశోధకులతో భేటీ అయ్యారు. ఎపి వర్సిటీలతో కలిసి జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్లు ప్రారంభించాలని.. స్టెమ్, ఏఐ, రెన్యువబుల్ ఎనర్జీపై నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. రెన్యువబుల్ ఎనర్జీ పరిశోధనలపై ఎపి వర్సిటీలతో కలిసి పనిచేయాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. యూఎన్ఎస్డబ్ల్యూను సందర్శించిన లోకేష్కు యూనివర్సిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అలాగే అధినాతన బోధనా పద్దతులు, టీచర్స్ ట్రైనింగ్, రెన్యువబుల్ ఎనర్జీ సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ ప్రత్యేకంగా లోకేష్కు వివరించారు. ఇక్కడున్న బోధనా విధానాన్ని ఎపిలో ప్రవేశపెట్టాలని, వివిధ రంగాల్లో ఎపిలో ఉన్న వర్సిటీలతో కలిసి పనిచేయాలని లోకేష్ కోరగా, తమ నిర్ణయాలను అతి త్వరలోనే తెలియజేస్తామని మంత్రికి చెప్పారు. కాగా%ొ% తొలిరోజు ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా అక్కడి తెలుగు వారిని కలిసిన లోకేష్.. ఎపికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని కోరారు. రెండోరోజు యూనివర్సిటీలపై దఅష్టి పెట్టిన మంత్రి లోకేష్ వివిధ యూనివర్సిటీలను సందర్శించబోతున్నారు.

## 12 గంటల్లోపు వాయుగుండం.. హోంమంత్రి కీలక ఆదేశాలు

అమరావతి, అక్టోబర్ 22 (టుడే విదుర) : బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. వాయుగుండం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోంమంత్రి అనిత సమీక్షా సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు.సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్,



ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు

## అప్పుడేం చేశారు గాడిదలు కాశారా?.. వైసీపీపై మంత్రి ఫైర్



విజయవాడ, అక్టోబర్ 22 ,(టుడే విదుర): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫైర్ అయ్యారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల నిర్మాణం పీపీపీ మోడల్లోనే జరుగుతుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజ్ల నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. రూ.5వేల కోట్ల పనులకు రూ.500 కోట్ల పనులే చేశారన్నారు. పులివెందులలో మాత్రమే జగన్.. మెడికల్ కళాశాలను పూర్తి చేశారని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో 10 మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో పూర్తి చేస్తామని ప్రకటించారు.జగన్ బెదిరింపులకు ఎవరూ తగ్గేది లేదన్నారు మంత్రి సత్యకుమార్. జగన్ తిరిగి అధికారంలోకి రావడం కల్ల అని ఎద్దేవా చేశారు. వైసీపీ వచ్చేది లేదు.. చచ్చేది లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పది మెడికల్ కళాశాలు పూర్తి అయితే 70 శాతం పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు

## వారి సారథ్యంలో ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు: మాధవ్




విజయవాడ, అక్టోబర్ 22 ,(టుడే విదుర): ఏపీకి కేంద్రం నుంచి లక్షన్నర కోట్ల సాయం అందిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రూ.11,444 కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 15 బిలియన్ డాలర్ల్ ఒక లక్షా 25వేల కోట్లతో విశాఖకు రావడం డబుల్ ఇంజన్ గ్రోత్కు ఒక చిహ్నమని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ గ్రోత్ సెంటర్గా మార్చేలా అనేక కంపెనీలు, ఐటీ సంస్థలు వస్తున్నాయని వెల్లడించారు మాధవ్.ప్రధాని మోడీ నేతృత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకురావడం, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడం వల్ల ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. కర్ణాటక వంటి పక్క రాష్ట్రాలకు కంటగింపుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దగా కోరు రాజకీయాలు చేస్తూ.. వారి వైఫల్యాలను వారే బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. కర్ణాటకలో ఫెయిల్ గవర్నమెంట్ ఉంది కాబట్టే.. ఆ పార్టీ తరపున వారు ఆక్రోశం వెలిబుచ్చుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మోడీ, చంద్రబాబులు అసాధ్యమైన అంశాన్ని సాధించి.. ప్రపంచ వ్యాప్తంగా ఏపీ గురించి చర్చించుకునేలా చేశారని ఏపీ బీజేపీ చీఫ్ తెలిపారు.కృత్రిమ మేధస్సుతో అనేక ప్రయోగాలకు విశాఖ వేదిక కాబోతుందన్నారు. ఎనర్జీ సోర్స్ కింద సోలార్, విండ్, హై ఎనర్జీలను వాడేందుకు గ్రీన్ ఎనర్జీ తయారవుతుందన్నారు. టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాన్ ఫ్యాక్చరింగ్లో యువత ప్రతిభకు చైనా తర్వాత ఏపీకే అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అమెరికాలో ఆంక్షలు ఉండటంతో భారత దేశంలోనే వీరంతా ఉండబోతున్నారని అన్నారు.

# సంపాదకీయం

## వ్యూహాత్మక స్వతంత్రతే భారత్ బాట

వ్యూహాత్మక స్వతంత్రతే భారత్ బాట'అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు పిచ్చెక్కినట్లుంది..' అని ప్రపంచవ్యాప్తంగా సంఖ్యానేకులు అభిప్రాయపడుతున్నారు. 30 ట్రిలియన్ డాలర్ల వార్షిక జీడీపీ ఉన్న అతిపెద్ద ఆర్థిక శక్తి అమెరికా. అంతేకాదు, అది అతిపెద్ద మిలటరీ సూపర్ పవర్ కూడా. పెంటగాన్ (అమెరికా రక్షణ మంత్రిత్వశాఖ నెలవు) ఆయుధాగారంలో వేలాది అణ్వస్త్రాలు ఉన్నాయిబీ అమెరికా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు, నిత్యం ప్రపంచ మహాసముద్రాలలో నలుమూలలా సంచరిస్తుంటాయిబీ 70 దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలున్నాయి. గత ఏడాది అమెరికా తన సైనిక శక్తిపై వేయి బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టింది. ప్రపంచ పటం నుంచి ఏ దేశాన్ని అయినా తుడిచిపెట్టగలిగిన శక్తి అమెరికాకు ఉన్నది. ఇంత మహాశక్తికి సర్వాధినేత అయిన అధ్యక్షుడు ట్రంప్ ఎంత బాధ్యతగా ఉండాలి?ండోసారి అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ట్రంప్ స్థిమితం లేనట్లు మాట్లాడుతున్నారు. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువో తేల్చుకోలేకపోతున్నారు. భారత్‌పై కక్షసాధింపుగా అన్నట్లు హెచ్%–%1బి వీసా, టారిఫ్‌ల విషయమై రకరకాల ప్రకటనలు గుప్పిస్తున్నారు. భారత్%–%పాక్ సంఘర్షణలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ తలెత్తినా అమెరికా తలదూరుస్తోంది. ప్రతి దేశానికీ సార్వభౌమాధికారం ఉంటుందన్న మాట మరిచి ఆయా దేశాల పక్షాన ట్రంప్ తానే ప్రకటనలు చేస్తున్నారు! ఆపరేషన్ సింధూర్ గురించి రకరకాల ప్రకటనలు చేసిన ట్రంప్ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని భారత్‌ను హెచ్చరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు మానేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చినట్లు కూడా ట్రంప్ తాజాగా ప్రకటించారు. అలాంటి హామీ ఏదీ తామివ్వలేదని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. అయినా భారత్‌పై టారిఫ్‌లు భారీ ఎత్తున పెంచక తప్పదని ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మొదట్లో ట్రంప్ మాటలకు విశ్వసనీయత ఉన్నదని భావించిన వారు సైతం ఇప్పుడు ఆయన అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ట్రంప్ ప్రకటనలను భారత్ ఏమీ లెక్కచేయనక్కర్లేదని భావిస్తున్నారు. చివరకు అమెరికా ప్రజలు కూడా ట్రంప్ వాచాలతకు విసుగు చెందుతున్నట్టు స్పష్టమవుతోంది. అమెరికా టెక్నాలజీ సంస్థలు కూడా ట్రంప్ హెచ్చరికలతో నిమిత్తం లేకుండా భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. వైజాగ్‌లో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థ నిర్ణయించడమే అందుకొక ఉదాహరణ. భారత్‌లో తన విస్తరణను నిలిపివేసే ప్రసక్తి లేదని ఆపిల్ సంస్థ కూడా ప్రకటించింది. ఈ సంస్థ గత ఆరు నెలల్లో భారతదేశం నుంచి 10 బిలియన్ డాలర్ల విలువైన ఐ ఫోన్లను ఎగుమతి చేసింది. నేతల విశ్వసనీయత, పెట్టుబడులకు లభించే ఆదరణ, ఫలితాలను బట్టి పారిశ్రామిక సంస్థలు నిర్ణయాలు తీసుకుంటాయి కాని, ఉత్తుత్తి బెదిరింపులకు అవి లొంగే అవకాశాలు తక్కువ. మార్కెట్ చలన సూత్రాలు వేరుగా ఉంటాయని వేరే చెప్పనక్కర్లేదు. ఈ పండుగ రోజుల్లో భారతీయులు దాదాపు రూ. 6 లక్షల కోట్లకు పైగా సరుకులు, సేవలకోసం ఖర్చు పెట్టడమే భారతదేశంలో పెరుగుతున్న మార్కెట్ శక్తికి నిదర్శనం.అయినా ట్రంప్ ప్రకటనలను తప్పనిసరైతే ఖండించడం తప్ప ఆయనపై వ్యక్తిగతంగా పరుష విమర్శలు చేయకూడదని భారత్ వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. భారతదేశ వ్యతిరేక ప్రకటనలు ట్రంప్ ఎన్ని చేసినా ఆయన తనకు 'మంచి స్నేహితుడు' అని మోదీ అభివర్ణిస్తున్నారు. నిజానికి ట్రంప్ ప్రకటనల వల్ల భారతీయుల ఆత్మాభిమానం ఎక్కువగా దెబ్బతిన్నట్లు కనపడుతోంది. దానివల్ల మోదీకి ప్రయోజనమే కాని నష్టం వచ్చే అవకాశాలు తక్కువ. ట్రంప్‌ను నేరుగా మోదీ ఎందుకు ఢీకొనడం లేదు? 'ప్రస్తుతానికి మౌనం వహించడం మినహా మనకు వేరే గత్యంతరం లేదు. అదే సరైన దౌత్యనీతి..' అని మన విదేశాంగశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. 'యుద్ధం చేయకుండానే ప్రత్యర్థిని తగ్గేలా చేయడం ఒక అద్భుత కళ' అని చైనా సైనిక వ్యూహకర్త సు జు తన 'ద ఆర్ట్ ఆఫ్ వార్'లో సూచించారు. వ్యక్తులతో నిమిత్తం లేకుండా అమెరికా లాంటి మహాశక్తి భారతదేశం వైపు ఉండడం, దాన్ని శత్రువుగా మార్చుకోకపోవడం అనేది అవసరం అని మన నాయకులు గ్రహించినట్లున్నారు.నిజానికి నరేంద్రమోదీ అమెరికాను భారత్‌కు సహజ మిత్రదేశంగా భావించారు. తాను తూర్పు తీరం నుంచి చూస్తే అమెరికా పశ్చిమ తీరం కనపడుతోందని, ఇరు దేశాలు ఒకే సువిశాలమైన ప్రాంతంలో భాగమని, తమ మధ్య స్నేహం ఇరు దేశాలకే కాక ప్రపంచ భవిష్యత్తుకు కూడా ఎంతో మంచిదని మోదీ 2014లోనే 'ఇండో%–%అమెరికా సీఈఓల ఫోరమ్'లో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం అమెరికాను తన అభివృద్ధి అజెండాలో సహాయకారిగానే భావించింది. మోదీ అధికారంలోకి రాగానే అమెరికాను తన హిందూ వ్యూహాత్మక అజెండాలో భాగంగా భావించారు. ప్రపంచ అగ్రరాజ్యంగా ఎదిగేందుకు భారత్‌కు అమెరికా అండ దోహదం చేయగలదని ఆయన ఆలోచించారు. ట్రంప్ ఎలుగెత్తుతోన్న 'అమెరికా ఫస్ట్' సిద్ధాంతానికి తన 'భారత్ ఫస్ట్' నినాదం తోడవుతుందని మోదీ అనుకున్నారు. ట్రంప్‌ను రెండోసారి గెలిపించేందుకు పనిగట్టుకుని ప్రచారం చేశారు. అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయులు పూర్తిగా ట్రంప్ వైపు మొగ్గేలా చేశారు. మోదీ ఇలా ట్రంప్‌ను పూర్తిగా విశ్వసించేందుకు ఎన్నో కారణాలున్నాయి.

ప్రధానంగా పాకిస్థాన్, చైనా విషయంలో భారత్ వైఖరితో ట్రంప్ తొలుత ఏకీభవించారు. తన ఎన్నికల ప్రచారంలో ఇస్లామిక్ తీవ్రవాదాన్ని, చైనా విస్తరణ వాదాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. అంతకు ముందు న్యూఢిల్లీ ఎన్ని ఫిర్యాదులు చేసినా ఉగ్రవాద బృందాలకు ఇస్లామాబాద్ మద్దతు గురించి వాషింగ్టన్ పట్టించుకునేది కాదు. జియా ఉల్ హక్ పాక్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా నుంచి లభించిన ఆర్థిక సహాయమే ఆ దేశంలో తీవ్రవాదాన్ని పెంచి పోషించింది. 1990 దశకం ప్రథమార్ధంలో ముంబైను అతలాకుతలం చేసిన దాడుల్లో లభ్యమైన బాంబులు పాక్‌లో తయారైనవని ఆధారాలు సమర్పించినా అమెరికా విస్మరించిందని అప్పటి హోంసెక్రటరీ పద్మనాభయ్య చెప్పారు. పాక్ అణుశాస్త్రవేత్తలు యురేనియంను స్మగుల్ చేసి అణుబాంబు తయారీ చేశారని తెలిసినా అమెరికా పట్టించుకోలేదని మాజీ విదేశాంగమంత్రి జస్వంత్‌సింగ్ తన '%ూా ఝశ్రీశ్రీ శీ ఎశీఅశీబతీ%'లో రాశారు. ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరు విషయంలో భారత్, అమెరికా, ఇజ్రాయెల్ సహజ మిత్రులని జస్వంత్‌సింగ్ నాటి అమెరికా విదేశాంగశాఖ సహాయ మంత్రి స్ట్రోబ్ టాల్బోట్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

# శ్రీశైలం కార్తీక మాసోత్సవాలు.. భక్తులకు కీలక సూచనలు




నంద్యాల, అక్టోబరు22 (టుడే విదుర): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి నవంబర్ 21 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. కార్తీకమాసం మొత్తం శ్రీస్వామివారి గర్భాలయ, సామూహిక అభిషేకాలు నిలుపుదల చేశారు ఆలయ అధికారులు. శని, ఆది, సోమ, ప్రభుత్వ సెలవులు, కార్తీక పౌర్ణమి రోజులలో స్పర్శ దర్శనాలను రద్దు చేశారు. కార్తీక మాసం ప్రారంభంకావడంతో శ్రీశైలం ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. నేటి (బుధవారం) నుంచి సాధారణ రోజులలో మూడు విడతలుగా శ్రీస్వామివారి స్పర్శ దర్శనాలకు భక్తులకు అనుమతి ఇవ్వనున్నారు.కార్తీక మాసోత్సవాల సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నవంబర్ 14న శ్రీశైలంలో మొదటిసారిగా కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 31న కృష్ణమ్మకు నదీహారతి, నవంబర్ 5న కార్తీక పౌర్ణమి జ్వాలాతోరణం నిర్వహిస్తామన్నారు. కార్తీక దీపారాధనకు ఆలయ ఉత్తర మాడ వీధిలో గంగాధర మండపం వద్ద భక్తులకు ఏర్పాటు చేశామని ఈవో శ్రీనివాసరావు వెల్లడించారు.మరోవైపు కర్నూలు జిల్లాలోని శైవ క్షేత్రాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. శ్రీశైలం, మహానంది, యాగంటి, కాల్వబుగ్గ, ఓంకారం క్షేత్రాల్లో కార్తిక మాసోస్తవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా పుణ్యక్షేత్రాలకు భక్తుల రద్దీ కూడా పెరిగింది. శ్రీశైలం పాతాళ గంగలో భక్తులు పుణ్య స్నానాలు చేసి దీపాలు వెలిగిస్తున్నారు. మహానంది, యాగంటి, కాల్వబుగ్గలో పుష్కరిణిలలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి దీపారాధన చేస్తూ ఆ శివయ్యను స్మరిస్తున్నారు.

# బీ కేర్ ఫుల్.. బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

అమరావతి:అక్టోబరు22 (టుడే విదుర): నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మధ్యాహ్ననికి ఈ అల్పపీడనం నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశముందని తెలిపింది.ఈ అల్పపీడనం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాల వైపు కదులుతూ తదుపరి 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. దీని ప్రభావంతో నేడు ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అప్రమత్తం చేశారు. మిగతా జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35–55 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద ఉండరాదని అలర్ట్ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పొంగిపోర్లే వాగులు,రోడ్లు దాటే ప్రయత్నం చేయకూడదని అధికారులు సూచిస్తున్నారు.




# ప్రాణం పోతున్నా.. పట్టించుకోలా

**రోడ్డుపక్కన కిందపడి కొట్టుకులాడిన వృద్ధురాలు**
**రక్తం కక్కుతున్నా ఎవరూ పట్టించుకోని వైనం**
**మనవడు, మనవరాలు ఏడుస్తున్నా సాయం చేయని జనం**
**స్థానిక ఎస్ఐ గమనించి ఆస్పత్రికి తరలింపు**
**అప్పటికే కన్నుమూత.. బొబ్బిలిలో అమానవీయ ఘటన**



బొబ్బిలి, అక్టోబరు22 (టుడే విదుర): అది జనసంచారం ఎక్కువగానే ఉన్న ప్రాంతం. అలాంటి చోట ఓ వృద్ధురాలు రోడ్డు పక్కన పడిపోయి.. నోటివెంట రక్తం కారుతూ విలవిల్లాడుతుతోంది. చిన్న పిల్లలైన ఆమె మనవడు, మనవరాలు ఏం చేయాలో పాలుపోక రోదిస్తూ.. సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయినా.. సాయం చేసేందుకు ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. చివరకు అటుగా వెళ్తున్న ఎస్ఐ గమనించి ఆమెను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె ప్రాణాలు విడిచింది. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో ఈ హృదయ విదారక ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బొబ్బిలి గొల్లవీధికి చెందిన బొట్ల ఆదమ్మ (65) నాలుగైదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కూలి పనులు చేసుకుని పొట్ట పోసుకునే ఆమె.. తన మనవడు, మనవరాలిని తోడు తీసుకుని చికిత్స కోసం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. బీపీ మాత్రలు తీసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా గొల్లపల్లి ఆటోస్టాండ్ వద్ద కళ్లు తిరిగి పడిపోయింది. నోటివెంట రక్తం రావడం మొదలైంది. ఆమె మనవడు, మనవరాలు విలపిస్తున్నా.. అటుగా వెళ్లే జనం సాయం చేసేందుకు ముందుకు రాలేదు. అటుగా వెళ్తున్న ఎస్ఐ రమేశ్ గమనించి ఆమెకు సపర్యలు చేశారు. ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె మృతదేహాన్ని ఇంటికి పంపించి, అంత్యక్రియల కోసం కొంతమొత్తాన్ని ఎస్ఐ సమకూర్చారు. ఆదమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదమ్మ బీపీ మాత్రల కోసం వచ్చిందని, బీపీ ఎక్కువగానే ఉండడంతో సీహెచ్‌సీకి రిఫర్ చేశామని గొల్లపల్లి యూపీహెచ్‌సీ డాక్టర్ అనిత తెలిపారు. ఆమె మాత్రలు తీసుకుని వెళ్లిపోయిందని, తర్వాతేం జరిగిందో తమకు తెలీదని చెప్పారు.

# బాణసంచా వివాదంలో.. భార్యను పొడిచేశాడు



పి.గన్నవరం/కాకినాడ(జీజీహెచ్)అక్టోబరు22 (టుడే విదుర): భార్యభర్తల మధ్య స్వల్ప వివాదం చినికి చినికి.. గాలివానగా మారింది. మద్యం మత్తులో భర్త.. చాకుతో భార్య ఎడమవైపు నుదిటి మీద బలంగా పొడవగా అది నోట్లోకి వచ్చింది. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి గ్రామంలో రాత్రి జరగ్గా బాధితురాలికి కాకినాడ జీజీహెచ్‌లో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి గ్రామానికి చెందిన నేలపూడి గంగరాజు అదే గ్రామానికి చెందిన పల్లాలమ్మ(పల్లవి)(36)ని 20ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గంగరాజు మద్యానికి బానిసై తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండడంతో కొంతకాలంగా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈక్రమంలో దీపావళి సందర్భంగా బాణసంచా కోసం కొంత నగదు గంగరాజు భార్యకు ఇచ్చాడు. ఈ విషయమై సాయంత్రం వారిద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో గంగరాజు మద్యం తాగి వచ్చి భార్యపై గొడవకు దిగాడు. ఈక్రమంలో తన దగ్గర ఉన్న చాకుతో గంగరాజు ఆమెను గొంతులో పొడిచేందుకు ప్రయత్నించాడు. తప్పించుకునే ప్రయత్నంలో పల్లవి తల కిందికి పెట్టడంతో చాకు ఎడమ కన్ను పైభాగం నుంచి నోట్లోకి దిగబడింది. దీంతో కుటుంబీకులు, బంధువులు వెంటనే ఆమెను అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీపావళి సెలవు కావడంతో అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. దీంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల వరకు శ్రమించి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులోనే ఉన్నట్టు సమాచారం.

# ఆ జిల్లాలో స్కూళ్లకు సెలవు..!




నెల్లూరు, అక్టోబరు22 (టుడే విదుర): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం స్కూళ్లకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. అలాగే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా.. ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా కంట్రోల్ రూమ్‌లోని 0861- 2331261, 7995576699 నెంబర్లుకు కాల్ చేయాలని సూచించారు.నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం తెల్లవారుజామున అల్పపీడనం బలపడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. అది క్రమంగా నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు తీరాల సమీపంలో బుధవారం ఉదయం వాయుగుండంగా బలపడుతుందని చెబుతోంది. అనంతరం 24 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని పేర్కొంది. అంతేకాదు.. ఇది తుపానుగా బలపడే అవకాశముందని అంచనా వేస్తోంది.అలాగే దక్షిణ బంగాళాఖాతంలో శుక్ర, శనివారాల్లో మరో అల్పపీడనం ఏర్పడవచ్చని వెల్లడించింది. మరోవైపు అరేబియా సముద్రంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ దిశగా కదులుతూ బుధవారానికి వాయుగుండంగా బలపడే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇంకోవైపు రానున్న ఐదు రోజులూ రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు విస్తారంగా కురవొచ్చని చెప్పింది. ఇక బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురస్తాయని.. శుక్రవారం నుంచి ఆదివారం వరకు అక్కడక్కడ భారీ వర్షాలు కురవొచ్చని తెలిపింది.బుధవారం అంటే.. ఈ రోజు నెల్లూరు, తిరుపతి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు.. అలాగే బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించింది. వర్ష ప్రభావిత జిల్లాల్లో ఉన్నతాధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ప్రజల అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలని విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ సూచించారు.

# చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



శ్రీకాకుళం క్రైం, అక్టోబరు22 (టుడే విదుర):శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఈనెల 19న సుమారు 55 ఏళ్ల వ్యక్తి అపస్మా రక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు 108 వాహ నంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రి లో చేర్పించారు. సదరు వ్యక్తి స్పృహలోనికి రాగా అతని వివరాలు అడుగగా శృంగవరపు లక్ష్మీనారా యణ అని మాత్రమే చెప్పాడని పోలీసులు తెలిపా రు. అయితే సదరు వ్యక్తి మృతి చెంది నట్టు, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో జవాన్ మృతి





## మరో ఆరుగురు జవాన్లకు గాయాలు

## అల్లూరి జిల్లాలో కల్వర్టును ఢీకొన్న కారు

## సెలవు ముగిసి.. విధుల్లోకి వెళ్తుండగా ఘటన


చింతూరుఅక్టోబరు22 (టుడే విదుర): రోడ్డు ప్రమాదంలో బీఎస్ఎఫ్ జవాను మరణించారు. మరో ఆరుగురు జవాన్లు గాయాలపాలయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం గొర్లగూడెం వద్ద తెల్లవారుజామున జరిగిందీ ప్రమాదం. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒడిసాలోని బలిమెల విద్యుత్ ఉత్పాదక రిజర్వాయర్ వద్ద బీఎసఎఫ్ జవాన్లు భద్రతా విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో కొందరు ఇటీవల సెలవుపై స్వస్థలాలకు వెళ్లారు. సెలవు ముగియడంతో ఏడుగురు జవాన్లు తిరిగి బలిమెలకు పయనమయ్యారు. తెలంగాణలోని ఖమ్మం నుంచి వారంతా కారులో చింతూరు మీదుగా బలిమెల వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జవాను అజిత్ సింగ్ డ్రైవింగ్ చేస్తుండగా.. నిద్రమత్తు వల్ల 30వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కల్వర్టును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బీఎసఎఫ్ జవాను గౌరవ్ కుమార్‌పాండే(43) అక్కడికక్కడే మృతి చెందారు. జవాన్లు అమితాబ్‌సింగ్, ఎండీ జామిన్, దేవ్‌కుమార్, గూర్జిత్‌సింగ్, వాసవభగత్‌సింగ్, అజిత్ సింగ్ గాయాలపాలయ్యారు. చింతూరు పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

# కల్తీ పెట్రోల్ విక్రయించారని ఆందోళన



గుత్తి, అక్టోబరు22 (టుడే విదుర):: స్థానిక గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కల్తీ చేసి విక్రయిస్తున్నారని గుంతకల్లు రోడ్డులోని పిండిమిషన యజమాని చంద్రశేఖర్ ఆందోళన చేశాడు. ఓ బాటిల్‌లో పెట్రోల్ పోయించుకోగా.. పెట్రోల్ తెల్లగా ఉం డటంతో కల్తీ చేశారంటూ ఆ బంక్ నిర్వాహకులతో వాగ్వివాదం దిగాడు. బా?ధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, సీఎసడీటీ ప్రవీణ్‌కుమార్ ఆ బంక్‌లో పెట్రోల్‌ను పరిశీలించారు. పెట్రోల్ శాంపిల్‌ను తీసుకుని ప్రయోగశాలకు పంపారు.

# శ్రీవారి దర్శనాల పేరిట వసూళ్ల దందా



తిరుమల,అక్టోబరు22 (టుడే విదుర): శ్రీవారి దర్శనం, ఆర్జితసేవలు, వసతి పేరుతో భక్తులను మోసగిస్తూ తప్పించుకు తిరుగుతున్న అశోక్‌కుమార్ రెడ్డి అనే దళారీని తిరుమల పోలీసులు అరెస్టు చేశారు. గడిచిన ఏడాది కాలంలో అతని బ్యాంకు ఖాతాల్లో రూ.కోటికిపైగా లావాదేవీలు జరిగినట్టు విచారణలో వెల్లడైంది. తిరుపతి జిల్లా చంద్రగిరి పాతపేటకు చెందిన బురిగాల అశోక్ అలియాస్ అశోక్‌కుమార్ రెడ్డి రాక్‌స్టార్ ఈవెంట్స్ ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన అమన్ గోయల్, గౌతమ్ గుప్తాకు వీఐపీ బ్రేక్ దర్శనం, కల్యాణోత్సవం, అభిషేకం, గదులు ఇప్పిస్తానని నమ్మించి రూ.4,16,500 నగదును విడతల వారీగా ఆన్‌లైన్ ద్వారా తన బ్యాంకు ఖాతాలో వేయించుకున్నాడు. తీరా ఆ భక్తులు తిరుమల చేరుకోగా అశోక్ ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో విజిలెన్స్ అధికారులను ఆశ్రయించి జరిగిన మోసాన్ని వివరించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా 16వ తేదీన తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే గోపాల్ నత్మల్ అగర్వాల్, రాధిక అనే భక్తులూ 17వ తేదీన నేరుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అశోక్‌పై ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో వన్, టూటౌన్ పోలీసులు ప్రత్యేక నిఘాతో అశోక్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి ఓ సెల్‌ఫోన్, బైక్, నాలుగు బ్యాంక్ పాస్‌పుస్తకాలను స్వాధీనం చేశారు. రెండు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసి తిరుపతి రెండో కోర్టుకు తరలించారు.పోలీసుల విచారణలో అశోక్ అక్రమాలు వెలుగుచూశాయి. గడిచిన ఏడాదిలో రూ.కోటికిపైగానే బ్యాంకు లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. రాజకీయ నాయకుల పేర్లు చెప్పడంతో పాటు టీటీడీలో తనకు మంచి పరిచయాలున్నట్టు భక్తులను నమ్మించి మోసగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కొన్నేళ్లుగా భక్తులను మోగిస్తూ లక్షల్లో వసూలు చేసినట్టు తేలింది. ఈ డీఎస్పీ విజయ్‌శేఖర్ మంగళవారం తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్ అలిపిరి పాదాలు అవుట్‌పోస్టులో మీడియాతో మాట్లాడారు. స్వామి దర్శనాలు, గదులు, సేవల పేరుతో అశోక్ భక్తులను మోగిస్తున్నాడని, భక్తుల నుంచి నగదు వసూలు చేసిన తర్వాత ఫోన్ ఆఫ్ చేసి పారిపోతున్నాడని వివరించారు. భక్తులు ఇలాంటి వ్యక్తులను నమ్మకూడదని, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే దర్శనం, వసతి, సేవలు పొందాలని సూచించారు.

# పెళ్లయిన ఏడాదికే..





గుర్ల, అక్టోబరు22 (టుడే విదుర): పెళ్లయిన ఏడాదికే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలంలోని కొండగండ్రేడు గ్రామానికి చెందిన రేజేటి పాపినాయుడు(28) బైకు పై వెళ్తుండగా ఫకీరుకిట్టలి జంక్షన్ సమీపంలో అదుపుతప్పి పడిపోయాడు. క్షతగాత్రుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక ఉంది. మృతుని కి వివాహమై సంవత్సరం కావస్తోంది. భార్యకు సీమంతం చేసి సా యంత్రం సరదాగా బైకుపై బయటకు వెళ్లిన పాపినాయుడు ఈ ప్రమాదానికి గురయ్యాడు. పాపినాయుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అర్ధాం తరంగా మృతిచెందడంతో భార్య, బంధువుల రోధనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పలాస జీడి పప్పునకు పేటెంట్ సాధించాలి



పలాస, అక్టోబరు22 (టుడే విదుర):పలాస జీడి పప్పు అరకు కాఫీ వలె పేటెంట్ హక్కు సాధించాలని ఎమ్మెల్యే గౌతుశిరీష కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయం లోజీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం ప్రధానకార్యదర్శి,జిల్లాటీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంకాల రవిశం కర్‌గుప్తా అధ్యక్షతన మనపిక్క-మన బాధ్యతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడు తూ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారంతో ఇప్పటికే పలాసలో కేంద్రీయ విద్యాలయం రప్పించుకున్నామని, జీడి బోర్డుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని,తొందరలోనే పలాసలో కొత్త పారిశ్రా మికవాడలో వ్యాపారులకు స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ప్రజలు దీవిస్తే పలాసను రాష్ట్రంలో అగ్రగామిగా తీర్చిదిద్దే బాధ్యత గౌతు కుటుంబానిదని భరోసా ఇచ్చారు. పలాస టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి మాట్లాడుతూ పలాస జీడి పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి సంయుక్తంగా కృషి చేయాలని, మన పిక్క-మన బాధ్యత కార్యక్రమం ద్వారా 2035 నాటికి పలాస జీడిపప్పు అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతులు సాధించాలని పిలుపునిచ్చారు. కొత్త జీడి వం గడాల ద్వారా అధిక లాభాలు కలిగే అవకాశాలు ఉన్నాయని, దీన్ని రైతుల్లో విస్తృ తంగా ప్రచారాలుచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, పీసీఎంఏ(పారిశ్రామికవాడ) అధ్యక్షుడు మల్లా రామేశ్వ రరావు, ఆలిండియా క్యాజూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, కార్మికసంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, బ్యాంకర్లు, ఉద్యానవనశాఖ అధికారులు, సైంటిస్టులు, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

# పెద్దపులి దాడిలో రెండు ఆవు దూడలు మృతి



పెద్ద దోర్నాలఅక్టోబరు22 (టుడే విదుర):పెద్దపులి దాడి చేసి రెండు ఆవు దూడలను చంపింది. ఈ ఘటన మండలంలోని పెద్దబొమ్మలాపురం గ్రామం గండిచెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన గోగుల వెంకటయ్య, గాలి శ్రీనివాసరెడ్డి ఆవు దూడలు రెండు రోజుల క్రితం అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లాయి. అవి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో యజమానులు అటవీ ప్రాంతంలో వెతుకుతుండగా ఆ రెండూ మృతి చెంది కనిపించాయి. పెద్దపులి దాడి చేసినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో వారు అటవీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

# గట్టును ఢీకొని బోటు బోల్తా

## మత్స్యకారులు సురక్షితం

## నాలుగు లక్షల ఆస్తి నష్టం



–యు.కొత్తపల్లి అక్టోబరు22 (టుడే విదుర): అమీనాబాద్ రేవు వద్ద నిర్మిస్తున్న హార్బర్ గట్టును ఢీకొనడంతో మత్స్యకారులు సముద్రంలోకి దూకి సురక్షితంగా ఒడికి చేరుకున్నారు. గట్టును ఢీకొనడంతో బోటు, వల ధ్వంసం కావడంతో సుమారు నాలుగు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు బుధవారం తెలిపారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లాలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన బోటు యాజమని పల్లేటి గాబ్రియల్ బోటుపై ముగ్గురు మత్స్యకారులు ఉదయం అమీనాబాద్ రేవు నుంచి వేటకు వెళ్లారు సముద్రంలో మత్స్య సంపద లభించకపోవడంతో తిరిగి అర్ధరాత్రి వస్తుండగా రేవులో నిర్మిస్తున్న హార్బర్ రాళ్ల గట్టును తగులుకొని బోటు బోల్తా కొట్టింది. దీంతో బోట్లో ఉన్న ముగ్గురు మత్స్యకారులు సముద్రంలోకి దూకి ప్రాణాలు రక్షించుకున్నారు. ఈ ప్రమాదంలో బోటు ధ్వంసం, వలలు తెగిపోవడంతో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. సుమారు నాలుగు లక్షలు నష్టం వాటిల్లినట్టు బోటు యజమాని తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇక్కడికి రాగా వారు ఇదే సమస్య తెలిపారు. ఆయన ఈ ప్రాంతాన్ని ఏరియల్ సర్వే చేసి వెళ్లారు. మళ్లీ సంఘటన జరిగింది. దీంతో మత్స్యకారుల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది.


# ఇంటర్ పాస్ మార్కులు మారాయ్

## గణితం 35.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ 29

## కొత్త విధానంపై కాలేజీలకు విద్యామండలి సమాచారం

## గణితంలో ఇక నుంచి ఒక్కటే పేపర్

## ఎలక్టివ్ సబ్జెక్టు ఆధారంగా మారనున్న మార్కులు



అమరావతి, అక్టోబరు22 (టుడే విదుర): ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి తీసుకొచ్చిన కీలక సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఈ మార్పులు కనిపించనున్నాయి. మార్పుల అనంతరం కొత్తవిధానం ఎలా ఉంటుందనే సమాచారాన్ని ఇంటర్ విద్యా మండలి తాజాగా కాలేజీలకు పంపింది. ఈ ఏడాది నుంచి గణితం ఒక్కటే సబ్జెక్టు ఉంది. ఇప్పటివరకూ 1ఏ, 1బీ ఉండగా వాటిని ఒక్కటిగా మార్చింది. గతంలో ఒక్కో పేపర్ 75 మార్కుల చొప్పున (పాస్ మార్కులు 26) పరీక్షలు జరిగేవి. ఇప్పుడు ఇంటర్ రెండేళ్లు గణితం ఒక్కటే పేపర్‌గా 100 మార్కుల చొప్పున పరీక్షలు జరుగుతాయి. అందులో 35 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులవుతారు. ఇక బైపీసీలో బోటనీ, జువాలజీని కలిపి బయాలజీగా మార్చారు. ఈ పేపరు 85 మార్కులకు ఉంటుంది. ఫస్టియర్‌లో 29 మార్కులు రావాలి. అదే సెకండియర్‌లో 30 మార్కులు వస్తే ఆ విద్యార్థులు పాస్ అయినట్లు లెక్క! ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లోనూ ఇవే మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఆయా సబ్జెక్టులకు గతంలో 60 మార్కుల చొప్పున పరీక్ష జరుపుతుండగా.. పాస్ మార్కులు 21గా ఉండేవి. కాగా, ప్రస్తుతం సెకండియర్ చదువుతున్న వారికి, గతంలో ఫెయిల్ అయి పరీక్షలు రాస్తున్న వారికి కొత్త మార్పులు వర్తించవు. మరోవైపు ఈ ఏడాది నుంచి కొత్తగా ఎలక్టివ్ సబ్జెక్టు విధానం తీసుకొచ్చారు.ఏ గ్రూపు విద్యార్థులైనా మొత్తం 24 సబ్జెక్టుల్లో దేనినైనా ఎంపిక చేసుకోవచ్చు. అందువల్ల విద్యార్థులు తీసుకునే సబ్జెక్టు ఆధారంగా ఫస్టియర్ మార్కులు మారతాయి. సైన్స్ సబ్జెక్టులైతే 85 మార్కులు, ఆర్ట్స్ సబ్జెక్టులైతే 100 మార్కులు ఉంటాయి. మొత్తంగా రెండేళ్లలో వెయ్యి మార్కులకు పరీక్షలు జరుగుతాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ విద్యార్థులకు రెండేళ్లకు 30 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ ఉంటాయి. అలాగే ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మరో వెసులుబాటు కూడా ఉంది. అదనంగా మరో సబ్జెక్టును కూడా తీసుకుని చదవొచ్చు. అయితే అవి మొత్తం మార్కుల్లో కలపరు. ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు గణితంను మాత్రమే అదనపు సబ్జెక్టుగా తీసుకోవచ్చు. ఎలక్టివ్ సబ్జెక్టు విధానం అమల్లోకి రావడంతో పరీక్షల షెడ్యూలు పెరిగింది.

# కౌల్దార్లను విస్మరించిన కూటమి ప్రభుత్వం




పల్నాడు జిల్లా :అక్టోబరు22 (టుడే విదుర):: అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న కౌలురైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని, కేరళ తరహా రుణవిమోచన చట్టం అమలు చేయాలని ఏపి కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన కౌలు రైతుల చట్టం దుర్మార్గమైందని, అధికారంలోకి రాగానే మార్పులు చేసి కొత్త చట్టాన్ని తెస్తామని కూటమి చెప్పిందని, పభుత్వ పథకాలు అమలు చేస్తామని, వడ్డీ లేని రుణాలిస్తామని హామీ ఇచ్చి ముసాయిదాకే పరిమితం చేసిందని విమర్శించారు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అక్టోబర్‌లో ఇస్తామని చెప్పినా ఇప్పటికీ విధివిధానాలు ప్రకటించలేదని, రైతు సంఘాల ప్రతినిధులతో చర్చలూ జరపలేదని అన్నారు. గతంలో జెఎల్‌జి గ్రూపులకు భూ యజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా ఐదుగురి గ్రూపునకు రూ.5 లక్షల రుణమిచ్చేవారని, ఇప్పుడు అదీ అమలుకాక ప్రైవేటు వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలేయాల్సి వస్తోందని అన్నారు. ఏ పంటకూ మద్దతు ధర అమలు కావడం లేదని, వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తున్నారని చెప్పారు. దేవుడి మాన్యం భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా పెట్టుబడి సహాయం, పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. 29న యడ్లపాడులో కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా మహాసభమండల కేంద్రమైన యడ్లపాడులో ఈనెల 29న నిర్వహించే కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయాలని రామారావు, రాధాకృష్ణ కోరారు. కౌలు రైతుల సమస్యలపై మహాసభలో చర్చించడంతో పాటు, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని, నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు.

# టీచర్లకూ టెట్

## ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నవారు ఈ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాల్సిందే

## సుప్రీంకోర్టు తీర్పు అమలుకు చర్యలు

## త్వరలో నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు




(అమరావతి–అక్టోబరు22 (టుడే విదుర):ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) విషయంలో పాఠశాల విద్యాశాఖ కీలక ప్రతిపాదన చేసింది. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలనుకునేవారితో పాటు టెట్ అర్హత లేని ఇన్ సర్వీస్ టీచర్లు కూడా ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. నిరుద్యోగులు, టీచర్లు ఇద్దరూ టెట్ రాసేందుకు వీలుగా త్వరలో నోటిఫికేషన్ జారీ చేయడానికి కసరత్తు చేస్తోంది. టీచర్లంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని కొద్ది నెలల కిందట సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ మేరకు చర్యలు చేపట్టింది. అయితే దీనిపై తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోనుంది. 2011లో టెట్ అమల్లోకి వచ్చింది. అంతకుముందు టీచర్ ఉద్యోగాలు పొందిన వారంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నవారు రెండేళ్లలో టెట్ సర్టిఫికెట్ పొందాలని ఆదేశించింది. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న టీచర్లకు మినహాయింపు ఇచ్చినప్పటికీ పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉండాలని పేర్కొంది. దీంతో టెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగాలు పొంది ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారంతా ఇప్పుడు అందులో ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. పదోన్నతి అవసరం లేదనుకుంటే ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారు మినహాయింపును పొందవచ్చు. కాగా, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ విద్య జాతీయ మండలి(ఎన్‌సీటీఈ)ని కొందరు టీచర్లు ఆశ్రయించారు. అయితే వీరి వినతిని ఎన్‌సీటీఈ తిరస్కరించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇందులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై కొందరు టీచర్లు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. ఒకవేళ అక్కడ టీచర్లకు మినహాయింపు లభిస్తే రాష్ట్రంలోనూ ఆ వెసులుబాటు దక్కుతుంది. లేనిపక్షంలో టెట్ లేని టీచర్లంతా కచ్చితంగా అందులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

# ఉచిత ఇసుకకు ‘గండి’



అచ్చంపేట అక్టోబరు22 (టుడే విదుర): ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపల్లి ఇసుక రీచ్‌లో ఉచిత ఇసుక విధానాన్ని ఆటంకపరుస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లు, ఇసుక కార్మికులు తమకు సమచారం ఇవ్వగా పరిశీలించామని, ఇసుక లోడుతో ఉన్న సుమారు 20 ట్రాక్టర్లను రీచ్‌లో నుంచి బయటికి రానికుండా కొందరు దారికి పొక్లెయినర్లతో గండిగొట్టారని చెప్పారు. రాత్రి సమయాల్లో ఇసుక లారీలకు లోడింగ్ చేస్తున్నారని, ఉదయాన్నే వచ్చిన తమను ట్రాక్టర్లకు లోడింగ్ చేయనీయకుండా కొన్ని రోజులుగా ఇబ్బందులు పెడుతున్నట్లు ఇసుక కార్మికులు చెప్పారన్నారు. ఈ చర్యలు మానుకోకుంటే పోలీసులు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై తహశీల్దార్, పోలీసులు స్పందించాలని, రోడ్డుకు గండి కొట్టిన పొక్లెయినర్ డ్రైవర్‌పైన, అతనితో ఈ పని చేయించిన వారిపైన కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# వర్షాలతో మొక్కజొన్న రైతులు విలవిల



చాపాడు :అక్టోబరు22 (టుడే విదుర): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా గత రెండు రోజులుగా పడుతున్న వర్షం తాకిడికి రైతులు విలవిలలాడిపోతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ లో మొక్కజొన్న, వరి పంట సాగు చేసిన రైతులు ప్రస్తుతం నూర్పిడి పనులు చేపడుతున్నారు. మొక్కజొన్న, వరి ధాన్యం వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పంట పొలాలలో వాటిని ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో రోడ్ల వెంబడి ఉన్న ఖాళీ ప్రదేశాల్లోకి విత్తనాలను తోలారు. ప్లాస్టిక్ వట్టలను కప్పి ఉంచి విత్తనాలు తడవకుండా నీటిని తొలగించుకుంటూ జాగ్రత్తలు పడుతున్నారు. వర్షానికి రైతులు నిద్ర లేకుండా వాటికి సంరక్షణ కోసం పడుతున్న అవస్థలు వర్ణించరానివి. అలాగే ఉల్లి పంట నూర్పిడికి సిద్ధంగా ఉన్నా ధరలు లేకపోవడంతో కొద్ది రోజులు ఆగి నూర్పిడి చేయాలనుకున్న రైతులకు వర్షం దెబ్బ ఘాటుగా తగులుతున్నది. వర్షానికి ఉల్లిగడ్డలు దెబ్బ తింటాయని రైతులు వాపోతున్నారు. పొట్ట దశకు వచ్చిన వరి పంట ప్రస్తుత వర్షానికి దెబ్బతింటుందని రైతులు పేర్కొంటున్నారు. బ్రహ్మ సాగర్, బోరు బావులు పెన్నా నది పరివాహ ప్రాంతాలు ముందస్తుగా సాగు చేసిన వరి పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉన్నది. వర్షానికి వరి పంట నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ఇప్పటికే నూరుపిడి చేసిన ధాన్యం పంట పొలాలలో ఉన్నది. చాపాడు మండలం అయ్యవారిపల్లి, తిమ్మాయిపల్లి, రాజువారి పేట, జీతం పల్లె తదితరు గ్రామాల పరిధిలో వరి పంట నూరుపిడి పనులు చేపట్టి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రబీ సాగుకు తీవ్ర నష్టం

%రవి పంటకాలం ప్రారంభం కావడంతో గత పది రోజులుగా మినుము, జొన్న, సొద్ద, వేరుశనగ, మొక్కజొన్న పంటలను రైతులు అధికంగా సాగు చేపట్టారు. గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాల వరకు ఆరుతడి పంటలను రైతులు సాగు చేపట్టారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో గత వారం రోజులుగా పడినటువంటి వర్షానికి విత్తిన విత్తనం మొలక రాకపోవడంతో రైతులు తీవ్ర నష్టం చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. కాస్త ముందుగా సాగు చేపట్టిన రైతులు కూడా గత పది రోజులు క్రితం పడిన భారీ వర్షానికి విత్తనాలు మొలకెత్తలేదు. దీనితో రెండవ దఫా సాగు చేపట్టారు. ప్రస్తుతం తిరిగి అధిక వర్షానికి విత్తనం మొలకెత్తే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరాకు రూ. 30 నుంచి 40 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని ఇది పూర్తిగా నష్టమని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రబీలో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# దారుణం.. కొడుకు చేతిలో తండ్రి హతం




హైదరాబాద్, అక్టోబరు22 (టుడే విదుర):: మద్యం మత్తులో కన్నతండ్రిని దారుణంగా హత్య చేసిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచయిపల్లి గ్రామానికి చెందిన నిజాముద్దీన్.. తన కుమారుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడితో కలిసి మంగళవారం రాత్రి మద్యం సేవించారు. అనంతరం ఆ మద్యం మత్తులో తండ్రి కొడుకుల మధ్య మాటమాట పెరిగింది. దీంతో వారిద్దరు ఘర్షణకు దిగారు. పక్కనే ఉన్న బండరాయి తీసుకుని.. కన్నతండ్రిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తండ్రి నిజాముద్దీన్ అక్కడికక్కడే మృతి చెందారు.

ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు షేక్ సాతక్‌తోపాటు అతడి స్నేహితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక నిజాముద్దీన్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నిజాముద్దీన్ కుటుంబ సభ్యులు.. ఆసుపత్రికి చేరుకున్నారు.

# ఫోన్ మాట్లాడి.. చెప్పకుండా వెళ్లిపోయాడని..



కొండమల్లేపల్లి, అక్టోబరు22 (టుడే విదుర): ఫోన్ మాట్లాడిన భర్త.. అడిగినా చెప్పకుండా ఆదరబాదరాగా ఇంట్లోంచి వెళ్లిపోవడం, వెతికినా అతడి ఆచూకీ దొరక్కపోవడంతో మనస్తాపానికి గురైన భార్య.. ఇద్దరు పిల్లలను చంపి, తాను ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో దీపావళి రోజే ఈ విషాదం జరిగింది. కుంచాల రమేశ్, నాగలక్ష్మి(27) దంపతుల స్వస్థలం ఏపీలోని బాపట్ల జిల్లా జనకవరం. వీరికి పిల్లలు అవంతిక (10), పవన్‌సాయి (8) ఉన్నారు. నాలుగేళ్ల క్రితం రమేశ్ తన కుటుంబంతో కొండమల్లేపల్లికి వచ్చి తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇటీవల కొత్తగా పెయింటింగ్ దుకాణం కూడా పెట్టాడు. సాయంత్రం రమేశ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్‌చేసింది ఎవరు? అని భర్తను నాగలక్ష్మి ప్రశ్నించగా.. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో రమేశ్ ఇంట్లోంచి వెళ్లిపోయి..ఫోన్ స్విచాఫ్ చేశాడు. భర్త కోసం నాగలక్ష్మి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళనకు గురైన నాగలక్ష్మి రాత్రి 9:20గంటలకు డయల్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పింది. పోలీసులు నాగలక్ష్మి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి అతడి గురించి వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలోనే నాగలక్ష్మి అదేరోజు రాత్రి తన ఇద్దరు పిల్లలను గొంతునులిమి చంపి.. తాను ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా రమేశ్‌కు గతంలో వేరే మహిళతో వివాహం జరిగింది. మనస్పర్థల కారణంగా ఆమెతో విడాకులు తీసుకున్నాడు. ఆ మహిళతో రమేశ్‌కు ఓ కూతురు ఉంది. ఆ పాప.. రమేశ్ స్వగ్రామంలో నాయనమ్మ వద్ద ఉంటోంది. ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన రమేశ్ అదే రోజు రాత్రి జనకవరానికి వెళ్లిపోయాడు. భార్య, పిల్లలు చనిపోయారానే విషయాన్ని తెలుసుకొని బంధువుల వెంట రాత్రి కొండమల్లేపల్లికి వచ్చాడు. విగతజీవులుగా ఉన్న ఇద్దరు పిల్లలు, భార్యను చూసి బోరున విలపించాడు.

# అల్పాహారంలో పురుగులు.. హోటల్ యజమాన్యానికి షాక్ ఇచ్చిన అధికారులు



హైదరాబాద్, అక్టోబరు22 (టుడే విదుర): రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడలో కస్టమర్‌కు హోటల్ యజమాన్యం గట్టి షాక్ ఇచ్చింది. ఆహార పదార్థాలు సరఫరా చేస్తూ.. పురుగులున్న బొండాలను కస్టమర్‌కు హోటల్ సిబ్బంది సరఫరా చేశారు. టిఫిన్ తింటున్న సమయంలో వాటిలో పురుగులు ఉ ండడంతో.. హోటల్ యాజమాన్యాన్ని కస్టమర్ ప్రశ్నించాడు. వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులకు అతడు ఫిర్యాదు చేశాడు. ఆ అధికారులు సదరు హోటల్ వద్దకు చేరుకుని.. సిబ్బంది సరఫరా చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. హోటల్ అపరిశుభ్రంగా ఉండడంతో.. ఆ యాజమాన్యానికి రూ. 10 వేలు ఫైన్‌ను అధికారులు వేశారు. అయితే పరిసర ప్రాంతాల్లోని హోటళ్లలో తనిఖీలు జరగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో హోటళ్ల యాజమాన్యం ఇష్టారీతిగా వ్యవహరించడమే కాకుండా.. అధిక ధరలు సైతం వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులను స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# డాక్టర్ నిర్లక్ష్యంతో యువతి బలి.. ఏం జరిగిందంటే



రంగారెడ్డి, అక్టోబరు22 (టుడే విదుర)::జిల్లాలోని శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువతి.. ఓ వ్యక్తిని ప్రేమించి గర్భవతి అయ్యింది. ఈ క్రమంలో సదరు వ్యక్తి ఆమెకు అబార్షన్ చేయించాలని నిర్ణయించాడు. దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి అబార్షన్‌కు ప్రయత్నించాడు.. కానీ అక్కడే అనుకోని ఘటన చోటు చేసుకోవడంతో యువతి ప్రాణాలను కోల్పోయింది. ఈ ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. ఏం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందాం. హోంగార్డ్ మధుసూదర్ ప్రేమ పేరుతో యువతిని గర్భవతిని చేశాడు. దీంతో యువతికి అబార్షన్ చేయించేందుకు ఆర్ఎంపీ డాక్టర్ పద్మజను సంప్రదించాడు. అందుకు ఆమె ఒప్పుకుని యువతికి అబార్షన్ చేసేందుకు అన్ని సిద్ధం చేసుకుంది. అయితే అబార్షన్ చేసే క్రమంలో వైద్యం వికటించి యువతి పరిస్థితి విషమంగా మారింది. యువతి పరిస్థితి విషమించడంతో ఆమెను హుటాహుటిన నగరంలోని హాస్పటల్‌కు తరలించే ప్రయత్నం చేశారు. కానీ హాస్పిటల్‌కు తరలిస్తుండగానే మార్గం మధ్యలో యువతి మృతి చెందింది. విషయం తెలిసిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుతం నిందితురాలు ఆర్ఎంపీ డాక్టర్ పద్మజ పరారీలో ఉన్నట్లు సమాచారం. నిందితురాలపై గతంలో పోలీసు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే మధుసూదన్ శంషాబాద్ పరిధిలో పోలీస్ క్లూస్ టీంలో విధులు నిర్వహిస్తున్నాడు. మృతురాలు షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ గ్రామానికి చెందిన యువతిగా పోలీసులు గుర్తించారు. యువతి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉ స్మానియా హాస్పిటల్‌కు తరలించారు. యువతి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు కోరుతున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితురాలు ఆర్ఎంపీ డాక్టర్ పద్మజ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

# బిల్లులు రాక ఇబ్బందులు

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు(ఫైల్)**

**- తీవ్ర ఒత్తిడిలో హాస్టల్ వార్డెన్లు**

**- విద్యార్థుల సంఖ్యలో వ్యత్యాసాలు ఉండడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం**



మంచిర్యాల, అక్టోబరు22 (టుడే విదుర):జిల్లాలోని వివిధ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు ఆరునెలలుగా బిల్లులు మంజూరుకావడం లేదు. దీంతో వార్డెన్లు తీవ్ర ఒత్తిడికి గుర వుతున్నారు. హాస్టళ్లలో రికార్డుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు వాస్తవసంఖ్య సరిపోకపోవడంతో బిల్లులు మంజూరు చేయ డం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వవసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ అమలు చేసేందుకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడానికి వార్డెన్లు ముందుగా తమ డబ్బులు వెచ్చించాల్సి ఉంటుంది. అనంతరం బడ్జెట్ మం జూరుకోసం పైఅధికారికి ప్రతిపాదిస్తారు. దాన్ని ఆ అధికారి జిల్లాస్థాయి ఉన్నతాధికారికి పంపడం ద్వారా బిల్లులు మం జూరు చేయాల్సి ఉంటుంది. రెండురోజుల క్రితం లక్షెట్టిపేట సోషల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం వార్డెన్ రాజగోపాల్ ఆత్మహత్యాయత్నం చేశారు. అధికారుల వేధిం పులు, బిల్లులు రాకపోవడంతోనే ఆయన ఆత్మహత్యాయత్నం చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరం లక్షెట్టిపేట హాస్టల్లో విద్యార్థుల సంఖ్య 250కి పెరిగింది. ఈ విషయమై తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని ఓ అధికారి బిల్లులు మంజూ రు చేయలేదని తెలిసింది. సదరు అధికారి వి??ధులకు సక్రమంగా హాజరుకావడంలేదని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 16రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 17న సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్షితిజకు ఫిర్యాదు చేశారు.

# ప్రజారోగ్యానికి వాయు గండం!

**దీపావళి రోజున కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి.. -**

**హైదరాబాద్‌లో 386కు చేరిన 'ఏక్యూఐ'**

**నాలుగేళ్లలో అక్టోబరులో ఇదే తొలిసారిగాలిలో**

**ధూళికణాల (పీఎం2.5) స్థాయి 37ఎంజీ నుంచి 69ఎంజీకి పెరుగుదల**

**గత ఏడాది కంటే తగ్గిన ధ్వని కాలుష్యం**

**ఉదయం 64.03, రాత్రి 60.68 డెసిబుల్స్**



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ,అక్టోబరు22 (టుడే విదుర): రాష్ట్రంలో దీపావళి టపాసులతో వాయు కాలుష్యం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఒక్కరోజులోనే ప్రమాదకర స్థాయికి చేరింది. ఇప్పటికే హైదరాబాద్‌తో సహ తెలంగాణలోని ముఖ్య నగరాల్లో వాయు కాలుష్యం పెరుగుతూ వస్తోంది. పారిశ్రామిక, రద్దీ ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. దీపావళినాడు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 386 మార్కును దాటింది. కేవలం కొద్ది గంటల్లోనే ఆ స్థాయికి చేరింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఏక్యూఐ 105 ఉండగా.. రాత్రి 9 గంటలకు 386కు పెరిగింది. హైదరాబాద్‌లో గత నాలుగేళ్లలో అక్టోబరు నెలలో వాయు కాలుష్య తీవ్రత ఈ స్థాయిలో లేదని గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది అక్టోబరులో ఏక్యూఐ ఒక్కసారి కూడా 100 దాటలేదు. ఇదే నెలలో గత నాలుగేళ్లల్లో ఒక్కసారీ 150 దాటలేదు. కానీ ఈ ఏడాది ఈ నెల 6వ తేదీ నుంచి ప్రతీ రోజూ భాగ్యనగరంలో ఏక్యూఐ 100-150కు మధ్య నమోదవుతూ వస్తోంది. దీపావళి రోజు ఏకంగా అత్యధికంగా స్థాయులో 386కు పెరగడం ఆందోళనకు గురిచేస్తోందని పర్యావరణవేత్తలు అంటున్నారు. ఏక్యూఐ.. 50లోపు ఉండాలి. ఈ సంఖ్య పెరిగిన కొద్దీ వివిధ క్యాటగిరీలుగా విభజించారు. 301 నుంచి 400 మధ్య ఉంటే పర్పుల్ అలెర్ట్ జారీ చేసి.. ప్రభావం తీవ్రంగా ఉంటుందని పరిగణిస్తారు. ఆరోగ్యవంతులకూ శ్వాసకోశ సమస్యలు రావచ్చు. గుండె జబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. దీపావళి రోజున హైదరాబాద్‌లో గాలిలో ధూళి కణాల స్థాయి (పీఎం 2.5) క్యూబిక్ మీటరుకు 69 మైక్రో గ్రాములకు పెరిగింది. ఇది సాధారణ రోజుల్లో 37 ఎంజీ ఉంటుంది. పీఎం10 కణాల స్థాయి సాధారణ రోజుల్లో 91 ఎంజీ ఉండగా, దీపావళినాడు 153 ఎంజీకి చేరింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఈ గణాంకాలను విడుదల చేసింది. అయితే గత ఏడాది దీపావళి రోజుతో పోలిస్తే ఈ ఏడాది పీఎం2.5 ధూళికణాల స్థాయి 15 ఎంజీ, పీఎం10 కణాల స్థాయి 31 ఎంజీ తక్కువగా నమోదైందని వెల్లడించింది.

# సినిమా



## సూర్యకు మరోసారి దురదృష్టం.. గోల్డెన్ ఛాన్స్ మిస్!




తమిళంతో పాటు తెలుగలోనూ స్టార్ హీరోగా సూర్య కి ప్రత్యేక క్రేజ్ ఉంది. అయితే గత కొన్నేళ్లుగా మాత్రం ఆయన కెరీర్‌లో తన స్థాయి హిట్ అందుకోవడంలో మాత్రం విఫలమవుతూ వస్తున్నాడు. ముఖ్యంగా కంగువా, రెట్రో సినిమాల విడుదలకు ముందు ఆరీ అంచనాలు నెలకొన్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయం చవిచూశాయి. దాంతో ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందుతున్న కురుప్పు (%ఖుతీబజూజూబ%) చిత్రంపై అందరి చూపు ఉంది. ఈక్రమంలో ఈ మూవీతో ఎలాగైనా హిట్ కొట్టి తీరాలని సూర్య పక్కా ప్లాన్ వేసుకున్నాడు. యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో నిండిన ఈ కమర్షియల్ మసాలా ఎంటర్‌టైనర్‌ను దీపావళికి రిలీజ్ చేయాలనే ఆలోచనలో టీమ్ ముందుకు వెళ్లింది. కానీ అనుకోని కారణాల వల్ల సినిమా రిలీజ్ వాయిదా పడింది. దర్శకుడు ఆర్జే బాలాజీ కూడా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీపావళికి రిలీజ్ చేయాలనే ఉద్దేశ్యమే ఉన్నట్టు వెల్లడించాడు. కానీ, పరిస్థితుల దృష్ట్యా సినిమా వాయిదా పడగా దాని ప్లేస్‌లో ఒక పాటను విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. ఇదిలాఉంటే.. ఈసారి దీపావళి సందర్భంగా తమిళనాడులో స్టార్ హీరో సినిమాలు ఏవీ రిలీజ్ కాకపోవడం గమనార్హం. ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ , ధృవ్ విక్రమ్ బైసన్ , హరీష్ కళ్యాణ్ డిజిలీ వంటి మీడియం రేంజ్ హీరోల సినిమాలే థియేటర్లలోకి వచ్చాయి. ఇవన్నీ సెంటర్ ఆడియెన్స్‌ను మాత్రమే టార్గెట్ చేసినవే. మాస్ ఆడియెన్స్ కోసం సరైన సినిమా లేకపోవడంతో తమిళనాడు బాక్సాఫీస్ వద్ద ఉత్సాహం పూర్తిగా తగ్గిపోయింది. %తెలుగులో కూడా ఈ దీపావళికి పెద్ద సినిమాల విడుదల లేకపోవడంతో, సూర్య కురుప్పుతో థియేటర్లలోకి వచ్చి ఉండుంటే రెండు భాషల్లోనూ బంపర్ ఓపెనింగ్స్ దక్కే అవకాశం ఉండేదని ఫర్వాలేదనే టాక్ వచ్చినా బ్లాక్ బస్టర్ అయ్యేదని, కలెక్షన్లుగూడా వచ్చేవని అభిమానులు, నెటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. సూర్య మంచి గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకున్నాడని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే..గత సంవత్సరం కూడా సూర్య కంగువాని దీపావళికే ప్లాన్ చేశాడు. కానీ ఆ సినిమా నవంబర్ 14కి వాయిదా పడింది. ఫలితంగా సినిమాకు వర్కింగ్ డేస్‌లో ఓపెనింగ్స్ బలహీనంగా వచ్చాయి. ఆ సినిమా డిసాస్టర్‌గా నిలిచింది. మొత్తం మీద సూర్యకు వరుసగా రెండోసారి దీపావళి రిలీజ్ మిస్ అయింది. ఒకసారి కంగువా టైమ్ మిస్ అవడం వల్ల భారీ నష్టం చవిచూసిన సూర్యకు ఈ మారు ఎలాంటి ఫలితం వస్తుందో వేచి చూడాలి.

## ఈ వారం ఓటీటీ, థియేటర్ సినిమాలు




సినిమా ప్రేక్షకుల కోసం ఈ వారం పక్కా ఎంటర్‌టైన్‌మెంట్ ట్రీట్ రెడీగా ఉంది. థియేటర్లలో చిన్న సినిమాలు విడుదలకు సిద్ధమవుతుండగా, ఓటీటీ ప్లాట్‌ఫార్మ్‌లలో ప్రపంచ వ్యాప్తంగా దుశాల నుంచి ప్రాచుర్యం పొందిన తాజా సినిమాలు, వెబ్ సిరీస్‌లు స్ట్రీమింగ్‌కి వస్తున్నాయి. యాక్షన్, రొమాన్స్, థ్రిల్లర్, ఫ్యామిలీ డ్రామా వంటి అన్ని జానర్లలో ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్ సిద్ధంగా ఉంది. థియేటర్‌లలో ఈ వారం తెలుగులో కేవలం మూడు సినిమాలు విడుదల అవుతుండగా అందులో ఒకటి విక్రమ్ కుమారుడు నటించిన తమిళ చిత్రం బైసన్ తెలుగులో డబ్బింగ్ రూపంలో నిలీజ్ అవుతుండగా మరో రెండు చిన్న సినిమాలు మాత్రమే రిలీజ్ కానున్నాయి. కన్నడ నుంచి ఆరు , మలయాళం, తమిళం, ఇంగ్లీష్ నుంచి ఒక్కో చిత్రం థియేటర్‌లోకి రానున్నాయి.


ఇక ఓటీటీలోనూ మాత్రం సినిమాలు, సిరీస్‌లు, డాక్యుమెంటరీలు భారీగానే విడుదల అవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కల్యాణ్ నటించిన ఓజీ, విజయ్ ఆంటోని భద్రకాళి వంటి సినిమాలు డిజిటల్ స్ట్రీమింగ్‌కు వస్తున్నాయి. వీటితో పదుల సంఖ్యలో హాలీవుడ్ కంటెంట్ సైతం దిగుమతి అయింది. ఇంటి పట్టున ఉండి టైం పాస్ చేయానుకునే వారు, వాచ్ లిస్టులో పెట్టుకుందాం అనుకునే వారు ఇప్పుడే ఈ కింది రాబోయే చిత్రాల జాబితాను చూసేయండి.

## చనిపోయే.. కొన్ని గంటల ముందు! అస్రాని.. చివరి మాటలివే




ఉత్తరాది ప్రేక్షకులను తన నటనతో కడుపుబ్బా నవ్వించిన నవ్వుల నవాబు గోవర్ధన్ అస్రాని(84) (%+శీజఖతీన్ట్రఖఅ ాంతీఖఅఱ%) కన్నుమూశారు. 'షోలే'లో కోట్లాది మందిని తన సహజ సిద్ధమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్న జైలర్ సాబ్ ఇక లేరు అని తెలియగానే బాలీవుడ్ విషాదంలో మునిగిపోయింది. అస్రాని నిష్క్రమణతో ఓ శకం ముగిసిందని సినీ అభిమానులు, ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య కారణాలతో నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరిన అస్రాని, సోమవారం చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. అస్రాని చనిపోయే కొన్ని గంటల ముందు కూడా సోషల్ మీడియా వేదిక ద్వారా అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 'నా అంతక్రియలకు ఎవ్వరినీ పిలిచి ఇబ్బంది పెట్టొద్దు, నేను ఒక కామన్‌మ్యాన్ గానే వెళ్లిపోవాలి' అని భార్య మంజు అస్రానితో ఆయన చెప్పారట. 1941లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు గోవర్ధన్ అస్రాని. సినిమా నటుడు కావాలనే ఆశయంతో కెరీర్ ఆరంభంలో పలు గుజరాతీ చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు అస్రాని. ఆ తర్వాత ముంబైకి చేరుకుని పుణేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నారు. 'హరే కాంచ్ కి ఛుడియాన్' ఆయన మొదటి హిందీ సినిమా. 'సత్యకం', 'గుడ్డి' సినిమాలు ఆయనకు నటుడిగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. 'షోలే' సినిమాలో అస్రాని చేసిన జైలర్ పాత్ర ఆయన కెరీర్‌ను మలుపుతిప్పింది. ఆ సినిమాలో అస్రాని చెప్పిన పలు సంభాషణలను ప్రేక్షకులు ఇప్పటికీ గుర్తుంచుకోవడం విశేషం. ఈ జైలర్ పాత్రను హాలీవుడ్ కమెడియన్ ఛార్లీ ఛాప్లిన్ స్ఫూర్తితో తయారు చేసినట్లు ఆ చిత్ర దర్శకుడు రమేశ్ సిప్పీ ఓ సందర్భంలో తెలిపారు. 'అభిమాన్', 'ఛోటీ సీ బాత్', 'నమక్ హరామ్' వంటి చిత్రాల్లో ఆయన నటనను ప్రేక్షకులు విశేషంగా ఆదరించారు.

## స్పీడు.. పెంచిన శ్రీనిధి! వరుస ఆఫర్లతో ఫుల్ బిజీ



టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. విక్టరీ వెంకటేశ్ దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని చిత్ర నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాలో కథానాయిక విషయంలో శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా అంటూ పలువురి పేర్లు తెర మీదకు వచ్చినా చివరకు కన్నడ నటి శ్రీనిధి శెట్టి (%వాతీఱఅఱసష్ట్రఱ రాష్ట్రవీఎ%)ని ఫైనల్ చేశారు. తాజాగా మంగళవారం శ్రీనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని మేకర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ అధికారికంగా ప్రకటించారు. %ఇప్పటికే ఈ ఏడాది హిట్3 చిత్రంతో మంచి విజయం రుచి చూసిన శ్రీనిధి దీపావళికి తెలుసు కదా అనే సెన్సిబుల్ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగానే విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ వంటి అగ్ర స్థాయి టీమ్‌తో పని చేసే ఛాన్స్ దక్కడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇప్పుడు ఈ చిత్రమే కాకుండా తమిళంతో అజిత్‌తో ఒకటి తెలుగులో మరో రెండు సినిమాలు సైతం అమ్మడి చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. %ఇదిలాఉంటే.. ఇప్పటికే వెంకటేశ్ సూపర్ హిట్ చిత్రాలు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. దీంతో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా తమన్ కాకుండా యానిమల్ ఫేం హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండడం విశేషం. కాగా ఈ మూవీ 2026 వేసవిలో ప్రేక్షకుల ఎదుటకు వచ్చే అవకాశం ఉంది.

## టిల్లు, మ్యాడ్.. క్రాస్ ఓవర్ సినిమాకి నేను రెడీ

టాలీవుడ్‌లో ఇప్పుడు ఫ్రాంచైజీలు, సినీ యూనివర్స్ కాన్సెప్ట్‌ల హవా నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పెద్ద బడ్జెట్ సినిమాలే కాకుండా చిన్న బడ్జెట్ సినిమాలు కూడా ఇప్పుడు ఫ్రాంచైజీలుగా మంచి ఇంపాక్ట్ చూపిస్తున్నాయి. కేజీఎఫ్ , కాంతార వంటి భారీ చిత్రాలు రెండేసి భాగాలుగా విడుదలై సంచలన విజయం సాధించగా సలార్, దేవర ఆ లైన్‌లో ఉన్నాయి. ఇక తెలుగులో మ్యాడ్, టిల్లు వంటి చిన్న బడ్జెట్ సినిమాలు సీక్వెల్స్ గా వచ్చి మంచి సూపర్ హిట్‌గా నిలిచాయి. ఈ క్రమంలో ఈ చిత్రాలన్నింటికీ మూడో భాగాలు కూడా సిద్ధమవుతున్నాయి. సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటించిన %ఇజీ% టిల్లు ఫ్రాంచైజీలో ఇప్పటివరకు రెండు సినిమాలు రాగా రెండు బ్లాక్‌బస్టర్స్ అవ్వడమే కాకుండా, టిల్లూ క్యారెక్టర్‌కి సూపర్ పాపులారిటీ తెచ్చాయి. ఇక ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడో భాగం టిల్లూ క్యూబ్ రాబోతోంది. సిద్దు ప్రస్తుతం తను చేస్తున్న ప్రాజెక్టులు పూర్తి చేసిన వెంటనే ఈ షూటింగ్ మొదలవుతుంది. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో మాడ్ ఫ్రాంచైజీ కూడా ఇప్పుడు మాడ్ క్యూబ్ గా మూడో పార్ట్ స్క్రిప్ట్ కూడా రెడీగా ఉందని ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. అంతేగాక టిల్లూ క్యూబ్ మరియు మాడ్ క్యూబ్ కలసి క్రాస్ ఓవర్ సినిమాగా తెరకెక్కనుందని. దీనికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించనున్నట్లు న్యూస్ వైరల్ అవుతోంది. %ఇటీవల విడుదలకు సిద్ధమైన మాస్ జాతర ప్రమోషన్ ఇంటర్వ్యూలో రవితేజ (%ఃఖజఱ ఎవయిఖ%), సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత నాగ వంశీ, దర్శకుడు కళ్యాణ్ శంకర్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఈ క్రాస్‌ఓవర్ గురించి మాట్లాడిన రవితేజ.. నేను రెడీనే! ఇలాంటి కొత్త ప్రయోగాలకు ఎప్పుడూ ఓపెన్‌గానే ఉంటాను అన్నారు. అదే సమయంలో ఫాహాద్ ఫాసిల్ చేసిన ఆవేశంలాంటి స్ట్రాంగ్ క్యారెక్టర్ రోల్ వస్తే కూడా తప్పకుండా చేస్తా అని పేర్కొన్నారు






# క్రీడావార్తలు




## ఆసీస్‌తో రెండో వన్డే.. టీమిండియా తుది జట్టు ఇదే!

ఆస్ట్రేలియా పర్యటనలో తొలి వన్డేలో భారత్ ఘోరంగా ఓడిన సంగతి తెలిసిందే. పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో టీమిండియాపై విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస లో భాగంగా రెండో వన్డే గురువారం ఆడిలైడ్( వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ వన్డేలో గెలిస్తే.. సిరీస్‌ను గెలిచే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఓడితే సిరీస్ ఆసీస్ కైవసం కానుంది. దీంతో ఆడిలైడ్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.రెండో వన్డే కోసం భారత్(తుది జట్టు ఎంపికైనట్లు సమాచారం. తొలి వన్డేలో భారత్ ఇద్దరు స్పిన్ ఆల్ రౌండర్లు, ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగింది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేసింది. అయితే తొలి వన్డే ఓటమి తర్వాత జట్టుపై విమర్శలు రావడంతో.. రెండో వన్డేలో కుల్దీప్ యాదవ్ ను ఆడించనున్నట్లు తెలుస్తోంది. బాల్ పాతబడిన తర్వాత స్పిన్నర్లకు అనుకూలిస్తోంది. ఈ క్రమంలోనే భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం కూడా ఉంది. తొలి వన్డేలో విఫలమైన హర్షిత్ రాణాపై వేటు వేసి కుల్దీప్ యాదవ్‌ను ఆడించవచ్చు. ముగ్గురు పేసర్లతో ఆడాలని నిర్ణయిస్తే



మాత్రం వాషింగ్టన్ సుందర్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల(కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా/కుల్దీప్ యాదవ్.

## దుబాయ్ రండి ట్రోఫీ ఇస్తా




న్యూఢిల్లీ: ఆసియా కప్ ముగిసి మూడు వారాలు దాటినా.. ట్రోఫీ మాత్రం విజేత భారత్ చెంతకు చేరలేదు. ఈ విషయంలో ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీని బీసీసీఐ మరోసారి తీవ్రంగా హెచ్చరించింది. ట్రోఫీని సరైన పద్ధతిలో భారత్‌కు చేర్చాలని డిమాండ్ చేస్తూ మెయిల్ చేసింది. ఇందుకు అఫ్ఘానిస్థాన్, శ్రీలంక బోర్డులు కూడా బీసీసీఐకి మద్దతుగా నిలిచాయి. అయితే, తీరు మారని నఖ్వీ.. ట్రోఫీ అప్పగిస్తానంటూనే కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. అదేంటంటే.. వచ్చేనెల 10న దుబాయ్‌లో ఓ ఈవెంట్‌ను ఏర్పాటు చేస్తామనీ, ఆ కార్యక్రమానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ సహా జట్టు సభ్యులంతా రావాలని బీసీసీఐకి పంపిన లేఖలో కోరారు. ఆ ఈవెంట్‌లో తన చేతులమీదుగానే ట్రోఫీ అందిస్తానని అందులో వివరించారు. ఇదిలా ఉండగా.. వచ్చే నెలలో జరిగే ఐసీసీ సమావేశంలో నఖ్వీపై బీసీసీఐ ఫిర్యాదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆసియా కప్ ఫైనల్లో పాక్‌ను ఓడించిన భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

## వన్డే చరిత్రలో సంచలనం




క్రికెట్ న్యూస్: ఒకప్పుడు వెస్టిండీస్ క్రికెట్ ప్రపంచంలో రారాజులాగా వెలిగింది. ఆ జట్టుతో మ్యాచ్ అంటే ప్రత్యర్థి జట్లు వణికిపోయేవి. కారణం..విండీస్ ఫాస్ట్ బౌలింగ్ ఆ రేంజ్ లో ఉండేది. ఆ తర్వాత అనూహ్యంగా చిన్న జట్ల స్థాయికి ఈ కరేబియన్ జట్టు పడింది. పలు సందర్భాల్లో చిన్న జట్ల చేతుల్లో కూడా ఓటమి చవిచూసింది. ఇటీవల కాలంలో ఏ రికార్డును తన ఖాతాలో వేసుకోని విండీస్ తాజాగా ఓ సంచలన రికార్డును నమోదు చేసింది. దీంతో ప్రస్తుతం ఈ కరేబియన్ జట్టు పేరు మారుమోగుతుంది. వివరాల్లోకి వెళ్తే..అక్టోబర్ 21(మంగళవారం)న బంగ్లాదేశ్‌లోని ఢాకా వేదికగా జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ జట్టు తమ ఇన్నింగ్స్ లోని 50 ఓవర్ల మొత్తాన్ని స్పిన్ బౌలర్ల చేత వేయించి వరల్డ్ రికార్డు నమోదు చేసింది. క్రికెట్‌లో పూర్తి స్థాయి సభ్యదేశం ఈ అద్భుతమైన ఫీట్‌ను సాధించడం ఇదే మొదటిసారి. తొలి వన్డేలో బంగ్లా స్పిన్ కు దెబ్బతిన్న విండీస్.. రెండో వన్డేలో స్పిన్నర్లతో దాడికి దిగాలను భావించింది. ఇది కరేబియన్ క్రికెట్ సంప్రదాయానికి పూర్తి విరుద్ధమైన నిర్ణయమైనా.. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్టుగా తీసుకున్న సరైన నిర్ణయంగా ఆ జట్టు నిరూపించింది. వెస్టిండీస్ జట్టు ఐదుగురు స్పిన్ బౌలర్లను (అకీల్ హొసేన్, రోస్టన్ ఛేజ్, ఖారీ పియెర్రీ, గుడకేశ్ మోటీ, అలిక్ అథనాజ్) ఉపయోగించింది. వీరి ధాటికి బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లకు 213 పరుగులు మాత్రమే చేయగలిగింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన విండీస్ కూడా నిర్ణీత 50 ఓవర్లకు 213 స్కోర్ చేసింది. దీంతో సూపర్ ఓవరతో కరేబియన్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్ లో రెండు రికార్డులు బ్రేక్ అయ్యాయి. వన్డే చరిత్రలో 50 ఓవర్లు స్పిన్నర్లతో బౌలింగ్ వేసిన తొలి జట్టుగా వెస్టిండీస్ నిలిచింది. అంతకుముందు శ్రీలంక 1996లో ఇదే కరేబియన్ జట్టుపై మూడు సార్లు 44 ఓవర్లు స్పిన్ బౌలింగ్ వేసింది.అలానే ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ 50 ఓవర్లు, బంగ్లాదేశ్ 42 ఓవర్లు (ముస్తాఫిజుర్ రెహమాన్ ఒక్కడే పేసర్) స్పిన్ బౌలింగ్ వేయడంతో, ఇరు జట్లు కలిపి మొత్తం 92 ఓవర్లు స్పిన్ బౌలింగ్ చేయడంతో అరుదైన వరల్డ్ రికార్డునమోదైంది. అంతకుముందు 78.2 ఓవర్ల రికార్డు ఉండేది.

## కెప్టెన్‌ను మళ్లీ మార్చారు




కరాచీ: పాకిస్థాన్ క్రికెట్ సారథిని మరోసారి మార్చారు. ఈసారి వన్డే కెప్టెన్ రిజ్వాన్‌పై వేటుపడింది. వచ్చే నెల ఆరంభంలో దక్షిణాఫ్రికాతో మొదలయ్యే మూడు వన్డేల సిరీసకు సీనియర్ పేసర్ షహీన్ షా అఫ్రీదికి సారథ్య బాధ్యతలు అప్పగించారు. వైట్‌బాల్ కోచ్ మైక్ హెస్సన్ సూచనల మేరకే నాయకత్వ మార్పు జరిగినట్టు తెలుస్తోంది. కోచ్‌గా హెస్సన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వెస్టిండీసతో వన్డే సిరీస్‌కు మాత్రమే రిజ్వాన్‌తో కలిసి పనిచేశాడు. ఇంత తక్కువ సమయంలో కెప్టెన్‌పై హెస్సన్ ఇలాంటి అభిప్రాయానికి రావడంపై మాజీ ఆటగాళు ఆశ్చర్యం వ్యక్తం చేసున్నారు. కానీ, కొందరు మాత్రం అసలు కారణాలు వేరే ఉన్నాయని చెబుతున్నారు. రిజ్వాన్‌లో మతమౌఢ్యం రోజురోజుకూ పెరిగిపోతోందని..డ్రెస్సింగ్ రూమ్‌లో ఆట గురించి కాకుండా మతపరమైన విషయాలు ఎక్కువగా మాట్లాడుతున్నాడని సమాచారం. రిజ్వాన్‌ను తప్పించాలన్న నిర్ణయం వెనుక సెలెక్షన్ కమిటీ, హైపర్ఫామెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావెద్‌తోపాటు పీసీబీ చైర్మన్, మాజీ కెప్టెన్లు మిస్బావుల్ హక్, సర్ఫరాజ్ ఖాన్‌ల ప్రమేయం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే పాలస్తీనా గురించి బహిరంగంగా మాట్లాడడం కూడా ఓ కారణం అంటున్నారు. ముఖ్యంగా బెట్టింగ్ కంపెనీలను తాను ఎండార్స్ చేయనని రిజ్వాన్ అన్నాడు. అయితే బెట్టింగ్ కంపెనీలతో ఒప్పందాలున్న పాక్ క్రికెట్ బోర్డుకు ఇది ఇబ్బంది కల్గించివుండవచ్చు.

## అడిలైడ్ పిచ్‌పై యూవీ లైట్లు

న్యూఢిల్లీ: ఆదివారం ఆతిథ్య ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరిగిన తొలి వన్డేకు వర్షం నాలుగుసార్లు అడ్డుపడింది. పెర్త్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌ను వరుణుడి కారణంగా 26 ఓవర్లకు కుదించాల్సి వచ్చింది. పదేపదే వర్షం అంతరాయంతో పచ్చికపై తేమ పెరగడం, పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలించడంతో ఓ దశలో టీమిండియా 45 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొనే గురువారం అడిలైడ్ ఓవల్ స్టేడియంలో జరిగే రెండో వన్డేకు అక్కడి గ్రౌండ్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం అక్కడ కూడా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. పిచ్‌పై తేమ శాతం పెరగకుండా ఉండేందుకు అల్ట్రావైలెట్ లైట్ల (అతినీలలోహిత కాంతి)తో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక వేడితో కూడుకున్న వెలుతురు వచ్చే ఈ యూవీ లైట్లను పిచ్‌పై ఉంచుతున్నారు. ఇలా చేయడం వల్ల తేమశాతం తగ్గడమే గాకుండా పిచ్ పొడిగా ఉంటుంది. అయితే, రెండో వన్డే రోజు




అక్కడ వర్షం కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ చెబుతోందొ'

## కశ్మీర్ క్రికెటర్ పర్వేజ్ రసూల్ రిటైర్మెంట్

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ నుంచి ప్రాతినిథ్యం వహించిన తొలి క్రికెటర్‌గా రికార్డుకెక్కిన పర్వేజ్ రసూల్ తన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. క్రికెట్‌లో అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్టు 36 ఏళ్ల రసూల్ ప్రకటించాడు. కుడి చేతివాటం ఆఫ్‌స్పిన్నర్‌గా 2014లో జాతీయ జట్టులో అరంగేట్రం చేసిన రసూల్ ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. బంగ్లాదేశ్‌తో ఆడిన ఆ మ్యాచ్‌లో పది



ఓవర్లలో 60 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. ఇక, ఒకే ఒక టీ20ని 2017లో ఇంగ్లండ్‌తో ఆడాడు. ఆ మ్యాచ్‌లో 5 పరుగులు చేసిన అతను ఒక వికెట్ పడగొట్టాడు. ఇక, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్న రసూల్ 5,648 పరుగులు చేయడంతో పాటు 352 వికెట్లు పడగొట్టాడు. జాతీయ జట్టుకే గాకుండా ఐపీఎల్ తరఫున ప్రాతినిథ్యం వహించిన తొలి కశ్మీర్ క్రికెటర్‌గానూ రసూల్ నిలిచాడు. పుణె వారియర్స్, బెంగళూరు, సన్‌రైజర్స్ జట్లకు ఆడిన రసూల్ 11 మ్యాచుల్లో 4 వికెట్లు తీశాడు.

## టాప్ లేపిన సఫారీలు



కొలంబో: కెప్టెన్ లారా వొల్వార్ట్ (90) దూకుడైన ఇన్నింగ్స్‌కు మరిజానె కాప్ (68 నాటౌట్, 3/20) ఆల్‌రౌండ్ షో తోడుకావడంతో.. మహిళల వరల్డ్‌కప్‌లో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసిన దక్షిణాఫ్రికా 10 పాయింట్లతో టాప్‌నకు చేరుకొంది. మంగళవారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 150 పరుగుల (డ/లూ పద్ధతి) తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ ఓటమితో పాక్ సెమీస్ ఆశలు ఆవిరయ్యాయి. వర్షం కారణంగా 40 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత సౌతాఫ్రికా 9 వికెట్లకు 312 పరుగులు చేసింది. మెగా టోర్నీ చరిత్రలో సఫారీలకు ఇదే అత్యధిక స్కోరు. సునె లుస్ (61), డి క్లెర్క్ (41) అదరగొట్టారు. నష్రా సంధు, సాదియా చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం డక్‌వర్త్–లూయిస్ పద్ధతి ప్రకారం తొలుత పాక్ లక్ష్యాన్ని 40 ఓవర్లలో 306 పరుగులుగా నిర్ణయించారు. అయితే, పలుమార్లు వర్షం ఆటంకం కలిగించడంతో టార్గెట్‌ను 20 ఓవర్లలో 234 పరుగులకు కుదించారు. కానీ, ఓవర్లన్నీ ఆడిన పాక్ 83/7 స్కోరు మాత్రమే చేసింది.బ్రిట్స్ విఫలం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. తజ్మిన్ బ్రిట్స్ (0) డకౌట్ అయింది. మరో ఓపెనర్ లారా, లుస్ రెండో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఆఖర్లో కాప్‌తోపాటు డి క్లెర్క్ మెరుపులు మెరిపించడంతో సౌతాఫ్రికా సులువుగా 300 మార్క్ దాటింది.సంక్షిప్త స్కోర్లు: సౌతాఫ్రికా: 40 ఓవర్లలో 312/9 (లారా 90, కాప్ 68 నాటౌట్, లుస్ 61బీ నష్రా 3/45, సైదా 3/63)బీ పాకిస్థాన్: 20 ఓవర్లలో 83/7 (సిద్రా 22 నాటౌట్, నటాలియా 20బీ కాప్ 3/20, షంగసె 2/19).

# బిజినెస్



## భారత్-అమెరికా ట్రేడ్ డీల్.. సుంకాలు భారీగా తగ్గనున్నాయా..




గత కొద్ది రోజులుగా భారత్, అమెరికా మధ్య వాణిజ్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రష్యా నుంచి చమురు కోనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై అమెరికా టారిఫ్ వార్ ప్రారంభించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రతీకార సుంకాల పేరుతో 25 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఇక, రష్యా నుంచి చమురు కోనుగోలు చేస్తోందనే కారణంతో ట్రంప్ మరో 25 శాతం సుంకాలు విధించారు ప్రస్తుతం భారత్ ఎగుమతులపై అమెరికాలో 50 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి. అయితే భారత్-అమెరికా మధ్య ఎన్నో రోజులుగా జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలోనే ఓ కొలిక్కి వచ్చే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. ఈ ట్రేడ్ డీల్‌తో భారత్‌పై అమెరికా సుంకాలు భారీగా తగ్గబోతున్నాయట. ప్రస్తుతం ఉన్న 50 శాతం నుంచి 15-16 శాతానికి తగ్గే వీలుందట. నవంబర్ 30 తర్వాత ఈ కొత్త టారిఫ్‌లు అమల్లోకి రావచ్చొని కొందరు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు %ఈ ట్రేడ్ డీల్ కోసం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకునే ప్రయత్నంలో భారత్ ఉన్నట్టు తెలుస్తోంది ప్రస్తుతం భారత్ ముడిచమురు దిగుమతుల్లో రష్యా వాటా 34 శాతంగా ఉంది. రష్యా నుంచి చమురు దిగుమతులను క్రమంగా తగ్గించుకునేందుకు భారత్ అంగీకరించనుందని సమాచారం.అమెరికాలో భారీగా పండే మొక్కజొన్న దిగుమతులను చైనా ఇటీవల భారీగా తగ్గించుకుంది. దీంతో ప్రత్యామ్నాయ మార్కెట్ కోసం భారత్ వైపు అమెరికా చూస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా నుంచి మొక్కజొన్న, సోయామీల్‌ను భారత్‌లోకి అనుమతించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## భారీగా తగ్గిన బంగారం ధర.. ఒక్క రోజులోనే ఆరు వేలు డ్రాప్..




పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్. రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్న బంగారం బుధవారం భారీ తగ్గుదలను నమోదు చేసింది. ఒక్క రోజులోనే ఆరు వేల రూపాయలు తగ్గింది. హైదరాబాద్‌లో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెటర్ల పది గ్రాముల బంగారం ధర బుధవారం ఉదయం రూ.1, 27, 200కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 16, 600కి చేరింది.అంతర్జాతీయ మార్కెట్లో మంగళవారం ఔన్స్ (31.10 గ్రాములు) ధర తగ్గడం వల్లే బంగారం ధరల తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ల బంగారం ధరం ఏకంగా 245 డాలర్లు క్షీణించింది. 4097 డాలర్లకు దిగి వచ్చింది. మరోవైపు వెండి కూడా ఔన్స్ ధర 3.9 డాలర్లు తగ్గి 48.39 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వెండి ధరలు కిలోకు దాదాపు రూ.2 వేలు తగ్గి రూ.1.80 లక్షలకు చేరుకున్నాయి.2013 తర్వాత ఈ రెండు లోహాలు ఒక్క రోజులో ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. ఈ రెండు లోహాలు గరిష్టాలకు చేరువు కావడం, అంతర్జాతీయంగా డాలర్ తిరిగి బలోపేతం కావడం, పలు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లబడడం అంతర్జాతీయ విపణిలో బంగారం ధర పతనానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

## బంగారం, వెండి.. రెండింటిలో ఏది కొంటే మంచిది..




బంగారం, వెండి ధరలు రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడం ఈ అరుదైన లోహాలకు కలిసి వస్తోంది. సెంట్రల్ బ్యాంకు కొనుగోళ్లు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల కారణంతో 2025లో బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధర 66% కంటే ఎక్కువ రాబడిని అందించింది. అలాగే వెండి ధర దాదాపు 87% పెరిగింది. రాబోయే రోజుల్లో ఈ రెండు లోహాలు మరింతగా పైకి ఎగబాకుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సురక్షిత పెట్టుబడులు, వడ్డీ రేట్లు తగ్గడం, రూపాయి విలువ తగ్గడం, సెంట్రల్ బ్యాంక్ దూకుడుగా పెట్టుబడులు పెట్టడం వంటి కారణాల వల్ల బంగారంలో పెరుగుదల కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1.50 లక్షల దాటుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు %బంగారం ఇప్పటికే భారీగా పెరిగినందున ఆచితూచి కొనడం మంచిది. ఈ ఏడాదిలాగే ముున్ముందు కూడా పెరుగుతుందని ఆశించకూడదు. అయితే ఆర్థిక భద్రత కోరుకునేవారు బంగారాన్ని ఒక స్థిరమైన పెట్టుబడిగా భావించొచ్చు. దీర్ఘకాలంలో లాభాలు ఆశించేవాళ్లకు కూడా బంగారం మంచి పెట్టుబడి ఆప్షన్ కింద పనికొస్తుంది. సెంట్రల్ బ్యాంకులు కొనుగోలు చేస్తుండడం బంగారానికి గిరాకీ పెంచుతోంది. అయితే ఇప్పటికే బంగారం ధర ఊహించిన దాని కంటే పెరిగిపోయింది కాబట్టి జాగ్రత్త పడడం అవసరం మరోవైపు వెండి కూడా పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మారింది (%వాఅశ్రీజవతీ =ఛ్వ ుశీఝు%). వెండిని ఇటు ఆభరణాల్లోనూ, మరోవైపు పారిశ్రామిక వినియోగంలోను కూడా వాడతారు. దీంతో వెండి ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. వెండి సరఫరా లోటు వరుసగా ఏడు సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం.. వెండి ధర 2026 చివరి నాటికి కిలోకు రూ. 2,40,000కు చేరుకుంటుంది %అయితే బంగారంతో పోల్చుకుంటే వెండి ధరల్లో ఒడిదుడుకులు కాస్త ఎక్కువ. పారిశ్రామికంగా డిమాండ్ ఎక్కువగా ఉంటే స్వల్ప కాలంలో బంగారం కంటే వెండి ఎక్కువ లాభాలు ఇవ్వగలదు. పారిశ్రామిక డిమాండ్ తగ్గితే అంతే వేగంగా పడిపోతుంది అయితే వెండి కూడా రాబోయే కాలంలో మంచి పెట్టుబడి ఆప్షన్‌గా ఉంటుంది.వెండితో పోల్చుకుంటే బంగారం కాస్త ఎక్కువ భద్రత అందిస్తుంది. ధర భారీగా పెరగకపోయినా, విలువ పడిపోవడం అన్నది తక్కువ మోతాదులోనే ఉంటుంది. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలినా, ద్రవ్యోల్బణం పెరిగినా, కరెన్సీ విలువ తగ్గినా, ఎలాంటి పరిస్థితుల్లో అయినా బంగారం ఒక సేఫ్ ఆప్షన్‌గా పనికొస్తుంది.

## ఐటీలో మళ్లీ నియామకాల జోరు



ముంబై: భారత ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ (ఐటీ) రంగం క్రమంగా గాడిన పడుతోంది. నిన్న మొన్నటి వరకు అంతంత మాత్రంగా ఉన్న ప్రాజెక్టుల రాక కొద్దిగా ఊపందుకుంది. దీంతో ఐటీ కంపెనీలు మళ్లీ నియామకాలపై దృష్టి పెట్టాయి. గత ఆర్థిక సంవత్సరం (2024 -25) తొలి ఆరు నెలలతో పోలిస్తే ప్రస్తు త ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు 27 శాతం పెరిగాయి. కంపెనీలకు మానవ వనరుల (హెచ్‌ఆర్) సేవలు అందించే అడెకో ఇండియా ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో నియామకాలు మరింత జోరందుకుంటాయని ఈ సంస్థ అంచనా. ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు క్రమంగా పుంజుకోవడమే ఇందుకు ప్రధాన కారణం.చిన్న నగరాలకూ వ్యాప్తి: ఐటీ కంపెనీలు గతంలో నియామకాల కోసం పెద్ద నగరాలపైనే దృష్టి పెట్టేవి. ఇప్పుడు క్రమంగా విశాఖపట్నం, ఉదయపూర్, నాగపూర్, కోయంబత్తూర్, ఇండోర్ వంటి చిన్న నగరాలపైనా దృష్టి పెడుతున్నాయి. దీంతో గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఈ చిన్న నగరాల నుంచి నియామకాలు 7 శాతం పెరిగినట్టు అడెకో ఇండియా నివేదిక తెలిపింది. అయినా కంపెనీలు ఇప్పటికీ బెంగళూరు, హైదరాబాద్, పుణె, ఢిల్లీ వంటి పెద్ద నగరాల నుంచే ఎక్కువ మందిని నియమించుకుంటున్నాయి. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఐటీ నిపుణుల కోసం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ).. ఐటీ కంపెనీలతో పోటీపడుతున్నాయి.జీతాలూ పెరిగాయి: నియామకాలతో పాటు ఐటీ ఉద్యోగుల జీతాల్లోనూ ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 5 శాతం పెరుగుల కనిపించింది. ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక డొమైన్స్‌లో అవసరమైన నైపుణ్యాలు దొరకడం ఇప్పుడు కంపెనీలకు పెద్ద సమస్యగా మారింది. భారీ జీతాలు ఇస్తామన్నా సరైన నిపుణులు దొరకడం లేదు. ఈ డొమైన్లలో పట్టున్న నిపుణుల కొరత ప్రస్తుతం 45 నుంచి 50 శాతం వరకు ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు యాభై ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్టు అడెకో ఇండియా తెలిపింది.

నిన్న మొన్నటి వరకు ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలు చాలా వరకు పక్కన పెట్టాయి. ప్రధాన కంపెనీలు కూడా ఇచ్చిన ఆఫర్లను సైతం ఏదో ఒక పేరుతో పక్కన పెట్టేవి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పరిస్థితి కొద్దిగా మారింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలలతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలు 25 శాతం పెంచినట్టు అడెకో తెలిపింది. అయితే కంపెనీలు గతంలోలా అల్లాటప్పా కాలేజీలకు వెళ్లడం లేదు. మంచి పేరు ప్రతిష్ఠలున్న ఇంజనీరింగ్, టెక్నికల్ సంస్థలకు వెళ్లి ఫ్రెషర్లను తీసుకుంటున్నట్టు అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప చెప్పారు. అది కూడా అన్ని విభాగాల వారికి కాకుండా కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి డొమైన్లలో ప్రాక్టికల్ నైపుణ్యాలు ఉన్న ఫ్రెషర్లకు మాత్రమే ఆఫర్ లెటర్లు ఇస్తున్నాయి. దీనికి తోడు గతంలోలా ఆఫర్ లెటర్లు ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా తమకు అవసరమైన డొమైన్లలో కాలేజీల్లోనే శిక్షణఇచ్చి మరీ జాబ్స్‌లోకి తీసుకుంటున్నాయి.

## దీపావళి అమ్మకాలు రూ 6 లక్షల కోట్లు




న్యూఢిల్లీ: ఈ ఏడాది దీపావళి రిటైల్ రంగానికి బాగానే కలిసొచ్చింది. ఈ పండగ సీజన్‌లో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.1.8 లక్షల కోట్లు ఎక్కువని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) తెలిపింది. దీనికి తోడు 50 లక్షల తాత్కాలిక కొలువులూ ఏర్పడ్డాయి. ఈ ఏడాది దీపావళికి నమోదైన రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాల్లో 75 శాతం అమ్మకాలు నాన్-కార్పొరేట్, సంప్రదాయ మార్కెట్ల నుంచి నమోదైంది. మళ్లీ ఇందులో రూ.5.4 లక్షల కోట్లు వస్తువుల అమ్మకాల ద్వారా, రూ.65,000 కోట్లు సేవల ద్వారా నమోదైనట్టు సీఏఐటీ తెలిపింది. రాష్ట్రాల రాజధానులు, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని 60 ప్రధాన పంపిణీ కేంద్రాల కేంద్రాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్టు పేర్కొంది.జీఎసటీతో బూస్ట్: ప్రభుత్వం జీఎసటీ రేట్లను కుదించడం ఈ సంవత్సరం దీపావళి అమ్మకాలకు బాగా దోహదం చేసినట్టు 72 శాతం మంది వ్యాపారులు వెల్లడించటం విశేషం. జీఎసటీ తగ్గింపుతో ఈ ఏడాది నిత్యావసరాలు, పాదరక్షలు, దుస్తులు, మిఠాయిలు, గృహాలంకరణ, వినియోగ వస్తువులు బాగా అమ్ముడుపోయాయి. ఈ అమ్మకాల జోరు ఈ ఏడాది చలి కాలం, పెళ్లిళ్ల సీజన్, సంక్రాతి, ఉగాది, శ్రీరామనవమి వరకు కొనసాగుతుందని సీఏఐటీ అంచనా. ఈ ఏడాది దీపావళికి నమోదైన రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాల్లో 28 శాతం అమ్మకాలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల నుంచి నమోదవడం విశేషం.

ఈ దీపావళి ఈ-కామర్స్ దిగ్గజాలకూ బాగానే కలిసొచ్చింది. గత ఏడాది దీపావళితో పోలిస్తే ఈ ఏడాది దీపావళికి ఈ సంస్థల అమ్మకాల పరిమాణం 24 శాతం పెరిగింది. విలువపరంగా చూసినా 23 శాతం వృద్ధి రేటు నమోదైందని యూనికామర్స్ అనే సంస్థ తెలిపింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006